J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 24 14.11.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### ● క్రమశిక్షణే లక్ష్యంగా..

# చండశాసనుడిగా.. చంద్రబాబు



## ➤ పార్టీలో గీతదాటితే వేటే
## ➤ కట్టుతప్పుతున్న వారికి అధిష్టానం హెచ్చరిక
## ➤ నోటీసుల జారీతో నాయకుల్లో కలవరం

***ఆం**ధ్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు తన మార్కు రాజకీయానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16నెలల తరువాత తన మాతృపార్టీ తెలుగుదేశంలో లోపిస్తున్న క్రమశిక్షణపైన దృష్టిపెట్టారు. దేనినైనా సరే సరిగ్గా వినియోగించుకుంటేనే సార్థకత చేకూరుతుందని పెద్దలంటారు. అది భౌతికంగా ఉండే వస్తువుకైనా, సామాజికంగా ఉండే సంస్థకైనా, రాజకీయ పార్టీకైనా సమానంగా వర్తిస్తుంది. పైగా ఎప్పటికప్పుడు సమీక్షలు, సంస్కరణల ద్వారా గాడిన పెట్టినప్పుడే అవి అదుపాజ్ఞల్లో ఉంటాయి. లేకుంటే ఎవరికివారే యమునాతీరే.. అన్న చందంగా పరిస్థితి మారుతుంది. ఈ విషయాన్ని అవపోసనపట్టి ఎప్పటికప్పుడు చాకచక్యంగా వ్యవహరిస్తూ, అటు పార్టీని, ఇటు పాలనను ఒకేసారి పరుగులు పెట్టించడం రాజకీయ చాణుక్యుడు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అందుకే ఎన్టీఆర్ తదనంతరం కూడా పార్టీ కేడర్ చెక్కుచెదరకుండా, నాయకత్వం చేజారకుండా, కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా పార్టీని ఆయన ముందుకు తీసుకెళ్లగలిగారు. ఈ క్రమంలో పార్టీలో క్రమశిక్షణ లోపించిన ప్రతిసారీ పార్టీపై దృష్టిసారించి ప్రక్షాళనతో.. కట్టుతప్పుతున్న నాయకులకు ముక్కుతాడు వేస్తూ అదుపు చేస్తుంటారు.*

తాజాగా పింఛన్ల పంపిణీకి హాజరు కాకపోవడం, బీమా సొమ్ము పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించిన 48 మంది ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులిచ్చి గీత దాటితే వేటు తప్పదనే హెచ్చరికలు జారీ చేశారు. దీంతో రాజకీయాలు ఎలా చేయాలి..? రాజకీయ పార్టీని ఎలా నడపాలి..? రాజకీయ నాయకుల తీరును ఎప్పటికప్పుడు ఎలా పర్యవేక్షించాలి..? మొత్తంగా పార్టీని ప్రాణప్రదంగా ఎలా చూసుకోవాలి..? అనే విషయాలకు చంద్రబాబు ఓ అచ్చమైన రోల్‌మాడల్ అనే వాదనలు మరోసారి జోరందుకున్నాయి. ఎందుకంటే సాధారణంగా ప్రాంతీయ పార్టీలో అధినేతే అన్నీ అయ్యి నడిపించినా స్థానిక పరిస్థితులు, రాజకీయ సంక్షోభాలు, ఆర్థిక సహాయం వంటి కారణాలతో ఎమ్మెల్యేలను అదుపు చేయడం అంత సులభం కాదన్నది జగమెరిగిన సత్యం. అయితే ఎన్ని కష్టాలెదురైనా, ఎన్ని సంక్షోభాలొచ్చినా, పరిస్థితులు దుర్భరంగా మారినా, క్షమశిక్షణే పార్టీకి శ్రీరామరక్ష అని, జవాబుదారీ తనమే రాజకీయాల్లో ఉత్తమ మార్గమని నమ్మిన నాయకుడు చంద్రబాబు. అందుకే పాలనలో ఎంతగా తలమునకలైనా, ఆర్థికంగా ఎన్ని కష్టాలున్నా, సంక్షేమ పథకాల అమలుకోసం ఎంతగా ఆపసోపాలు పడుతున్నా, పార్టీ నిర్వహణ, నాయకుల తీరు, కార్యకర్తల అభిలాష వంటి అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తెలుగుదేశం, నిరంతరం వెలుగుదేశంగా మారేందుకు శ్రమిస్తున్నారనే కితాబులందుకుంటున్నారు.

### ఈమాత్రం దూరదృష్టి లేకనే జగన్ అధోగతి!

కార్పొరేట్ తరహాలో నడిపితే రాజకీయాల్లో నెగ్గుకురావడం అసంభవం. ఎందుకంటే ఎక్కడో అంబానీ, అదానీలా రాజప్రాసాదంలో కూర్చుని ప్రణాళికలు రూపొందించి మిడిల్ మేనేజ్‌మెంట్‌కు అప్పగిస్తే, వ్యాపారంలో ఓకే కానీ, పాలిటిక్స్‌లో మాత్రం కాదు. ఆలా చేస్తే ఎలా దెబ్బతింటారనడానికి వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డే పెద్ద ఉదాహరణ. వాస్తవానికి నాయకుడు ఎప్పటికప్పుడు కింది స్థాయి వారితో సంప్రదింపులు చేస్తూ వారి ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాలి. లేకుంటే ఇబ్బందులు తప్పవు. గతంలో వైఎస్ జగన్ కేవలం తన ఖజానా నిండుతోందా..? తదుపరి ఎన్నికలకు పార్టీ ఫండ్

2లో



# చండశాసనుడిగా.. చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

కావాల్సినంత ఉందా..? ప్రత్యర్థులపై అనుకున్న విధంగా కక్ష సాధిస్తున్నామా..? అనే అంశాలకే పరిమితమైపోయారు. ఈ క్రమంలో ప్రజలతో, కార్యకర్తలతో ప్రత్యక్ష సంబంధాలను కోల్పోయారు. సజ్జల, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి వంటి మధ్యవర్తులను నమ్మి నట్టేట మునిగారు. అయితే, ఇలాంటి పరిస్థితులను తన రాజకీయ జీవితంలో లెక్కకుమిక్కిలిగా చూసిన చంద్రబాబు రాజకీయ ప్రాథమిక సిద్ధాంతాలకు కట్టుబడి జాగ్రత్తగా ముందుకు సాగుతున్నారు. ఖజానాతో పాటూ కార్యకర్తల మనోభావాలకూ ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఏడాదిన్నరగా నాయకులకు దిశానిర్దేశం చేస్తూనే గ్రాఫ్ పెంచుకోవాలని పలుమార్లు సూచించారు. లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరించారు.

## నోటీసులతో నాయకులకు ఝలక్!

ఇన్నాళ్ళూ సూచనలు, హెచ్చరికలతో పార్టీలో దారి తప్పుతున్న ఎమ్మెల్యేలను అదుపు చేస్తున్న చంద్రబాబు, మాటవినని వారిపై తాజాగా కొరడా ఝుళిపించారు. కనీసం పింఛన్ల పంపిణీలో కూడా పాల్గొనకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ప్రతినెలా ఏదో ఒక జిల్లాలో తానే స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నానని, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఆమాత్రం తీరిక లేదా? అని ప్రశ్నించారు. కేవలం సామాజిక పింఛన్లకే రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.34 వేల కోట్లు కేటాయిస్తోందని, అంత ప్రతిష్టాత్మకమైన పథకాన్ని కూడా ప్రజలలోకి తీసుకువెళ్లలేకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా నియోజకవర్గాల్లో అసంతృప్తులని సమాధానపరుస్తూనే పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు చురుగ్గా ఉండాలని, లేకుంటే తానే స్వయంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. కనీసం కార్యకర్తల కుటుంబాలకు బీమా సొమ్ము అందజేయడంలోనూ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించడం క్షమించరాని నేరమంటూ మండిపడ్డారు. నోటీసులందుకున్నవారు త్వరలోనే వివరణ ఇవ్వాలని, లేకుంటే పార్టీ పరంగా అధిష్టానం తనపని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. రోజూవారీ కార్యాచరణ, వారానికోసారి విశ్లేషణ, నెలకోసారి సమీక్ష, ప్రజాభిప్రాయ సేకరణతో ముందుకెళ్తున్నానని, ప్రతిఒక్కరి పనితీరుపై పూర్తి నివేదిక స్వయంగా తానే రూపొందిస్తున్నానని, ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే భవిష్యత్ అగమ్యగోచరం కావడం ఖాయమని చంద్రబాబు కొందరు నాయకుల వద్ద ప్రస్తావించినట్లు సమాచారం.

## మంగళగిరి కేంద్రంగా విభేదాలకు మంగళం!

ఏ పార్టీలోనైనా అంతర్గత విభేదాలు రావడం అత్యంత సహజం. అయితే అవి చిలికిచిలికి గాలివానగా మారకుండా టీకప్పులో తుఫానులా సమసిపోయేలా చూసుకోవడం అధినాయకుడి ప్రధాన బాధ్యత. దీన్ని అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ పార్టీ గాడితప్పకుండా చంద్రబాబు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల నెల్లూరుజిల్లాలో బాలకృష్ణకు అత్యంత సన్నిహితుడైన నుడా (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెట్ అథారిటీ) ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, చంద్రబాబు కుడిభుజంగా చెప్పుకునే మంత్రి నారాయణ ప్రధాన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. అయితే, ఇవి శృతిమించకుండా తెలుగుదేశం అధినేత జాగురూకతతో వ్యవహించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఉన్న మంగళగిరి వేదికగా చర్చలు జరిపి ఈ వివాదాన్ని ముగించారు. తాజాగా ఎమ్మెల్యే కొలికిపూడి, ఎంపీ కేశినేని చిన్ని మధ్య నెలకొన్న గొడవపై పార్టీ క్రమశిక్షణా కమిటీతో నివేదిక తెప్పించుకున్నారు. అయితే, దాని ఆధారంగానే ఓ నిర్ణయానికి రాకుండా స్వయంగా తాను మరోసారి ఆ ఇద్దరితో మాట్లాడి చర్యలు చేపడతానని చెప్పడం ద్వారా తన శైలి ఏమిటో, తన ఆలోచనా విధానం ఎలాంటిదో చంద్రబాబు చెప్పకనే చెప్పారనే అభిప్రాయం పార్టీ వర్గాలలో వ్యక్తమవుతోంది. ఇక పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్లయితే, గతంలో ఎన్టీఆర్ తన కేబినెట్ మంత్రుల మొత్తంచేత ముందే రాజీనామా చేయించి ఆ లేఖలని తనవద్దే ఉంచుకునే వారని, తద్వారా పార్టీలో క్రమశిక్షణ తప్పకుండా జాగ్రత్త పడేవారని, ఇంచుమించు అదే దారిలో చంద్రబాబు ప్రయాణిస్తున్నారని అంటున్నారు. నాయకులకు తగినంత స్వేచ్ఛనిస్తూనే, వారు గీత దాటకుండా, పరిధికి లోబడి పనిచేసేలా చూసుకుంటున్నారని చెబుతున్నారు. ఏదేమైనా దశాబ్దాలుగా పార్టీలో క్రమశిక్షణ, నిర్ణయాల్లో కచ్చితత్వం, కట్టుతప్పుతున్న వారికి కళ్లెం వేయడంలో తనకు తానే సాటి అని చంద్రబాబు చాటుకుంటున్నారన్న మాట రాజకీయ విశ్లేషకుల నుండి వినపడుతోంది. ఓ వైపు బుగ్గ గిల్లి బుజ్జగిస్తూనే, మరోవైపు చండశాసనుడై చండ ప్రచండం చేస్తున్నాడని తెలుగు తమ్ముళ్ళు అభిప్రాయ పడుతున్నారు!

# మండల నాయకులు పార్టీని బలోపేతం చేయాలి

## ఎమ్మెల్యే కాకర్ల దిశానిర్దేశం



వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన పార్టీ కార్యాలయంలో ఆపార్టీ మండల, క్లస్టర్, యూనిట్ కమిటీలు అధ్యక్ష కార్యదర్శుల నియామక ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 11న అట్టహాసంగా జరిగింది. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.చంచలబాబుయాదవ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎల్‌సి రమణారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని పార్టీ నాయకులతో ప్రమాణస్వీకారం చేయించారు.

### మండల రథసారధులు వీరే :

వింజమూరు మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, దుత్తలూరుమండల కన్వీనర్‌గా ఉండేల గురువారెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్‌గా చంద్ర మధుసూదన్‌రావు, సీతారాంపురం కన్వీనర్‌గా చింతల శ్రీనివాసులు, కొండాపురం కన్వీనర్‌గా పోలినేని చంద్రబాబు నాయుడు, జలదంకి మండల కన్వీనర్‌గా మునగాల తిరుమలరెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జీలుగా సీతారామపురం–తోకల రామచంద్ర, ఉదయగిరి – షేక్ రియాజ్, దుత్తలూరు– తాళ్లూరి దయానందం, వరికుంటపాడు – పోక మహేష్, వింజమూరు – చేబ్రోలు వసంతరావు, కొండాపురం– పోలినేని రమేష్, కలిగిరి – కల్లూరి చంద్రమౌళి, రాఘవేంద్ర, జలదంకి–మందపల్లి మాల్యాద్రి, పూనూరు భాస్కర్‌రెడ్డి, కో–క్లస్టర్ ఇన్చార్జులుగా పేరం సుధాకర్‌రెడ్డి, మారెళ్ళ మల్లికార్జున, పాములపాటి మాల్యాద్రి, అంబటి శంకరయ్య, నోటి మల్లికార్జున, దివి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శులుగా, ముత్తూరు సుమన్‌బాబు, పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్, బద్దిపూడి మాచర్ల, జాజుల శివరామయ్య, చల్లా శ్రీనివాసులుయాదవ్, కందుకూరి వెంకటేశ్వర్లు, వీరితోపాటు మండల పార్టీ సారథులు మరో 95మంది చేత ఎమ్మెల్యే కాకర్ల ప్రమాణస్వీకారం చేయించారు.

గల్పిక

# అల్లోల్లో... ల్లోల్లో... అల్లోల్లో... ల్లోల్లో....

"సెగట్రీ... ఇటు రా. సూడు. ఆకాశంలో శంద్రుడు ఎంత కులాసగా కనపడుతుండాడో సూడు. సగం దేశాన్ని మింగేసి కూడా పెశాంతంగా నవ్వుతూ కనపడే మన అదానీ లాగా లేదూ..."

"ఎస్సర్...."

"పైన ఆకాశంలో ఆ మేగాల్ సూడు... ఎట్టా పరిగెత్తుతున్నాయో.... లంచాలు మరిగిన మన లీడర్లు మేగా కిష్నారెడ్డి ఎనకాలబడి పరిగెత్తుతున్నట్టు లేదూ..."

"ఎస్సర్..."

"ఎస్సర్ కాదు. ఎవడేడుపు ఐనా సొమ్ములు కోసవే. తిరపతి ఎంకన్న సూడు. డబ్బులు కోసవే గదా! రకరకాల దర్శనాలిత్తన్నాడు."

"ఎస్సర్"

మడిసన్నాక కూసింత కలా పోసన ఉండాలయ్యా. ఎప్పుడూ డబ్బు యావే కాదు. లేకపోతే... ఇక మదుసులికి... మన లీడర్లకి తేడా ఏటుంటాది?. అన్నట్టు.. ఇయ్యాల అమరావతి నుంచి ఎవడో వత్తాడన్నావ్... వచ్చాడా?"

"యస్సర్... వచ్చాడు. పిలవమంటారా?"

"వద్దులే. మనవే ఎల్దాం ఆడికాడికి... బిగినెస్సులు ఎప్పుడూ గదుల్లో మాట్టాడుకోకూడదు.."

అల్లోల్లోల్లో.... నేనండీ మాడాని...

"అల్లోల్లోల్లో... మాడా!? ఏంటిలా దయ సేశారు... అప్పుడెప్పుడో దోపర యుగంలో కనపడి రెండు మూడు బిజినెస్సులు తెచ్చావ్. మళ్లీ ఇయ్యాల కనపడ్డావ్."

"సిత్తం సిత్తం... ఏటి సేత్తాం? నే లేకపోతే గౌర్మెంట్‌లో పనుల్ జరగడం లేదంట. మళ్లీ పని బడింది. సిన్న బిగినెస్ పని మీద వచ్చాను... అలా గదిలోకెల్లి మాట్టాడుకుందారేటీ..."

"వద్దులెండి. సీక్రెట్టయితే.... ఇక్కడే బెటర్. గోళ్ళకి సెవులుంట్రై..."

"ఏం లేదు. కెలుకుడుపూడి సీనోసరావు ఉన్నాడు గందా! అణ్ణి మినిస్టర్‌ని సేయించాలి. నాగబాబు తెల్సు కదా! అణ్ణి కూడా అదే ఊపులో మినిస్టర్‌ను సేసెయ్యాల. అసలాగలేక పోతన్నాడు. ఇద్దరికీ కలిపి ఎంతవుద్ది? ఒక్కొక్కడికీ ఎంతవుద్ది?"

"ఓస్ అంతేనా..."

"అంతేనా అంటే... అంతే కాదండి. కేశ్నేని సిన్నితో పెద్ద నూసెన్స్‌గా ఉందంట. ఆన్ని పీకేసి, ఆ ప్లేస్‌లో నాన్ని కూకోబెట్టాలండి... ఎంతవుద్ది!?

"దాందేముందిలెండి. అట్టాగే సేద్దాం. ఈడి మీద పుకార్లు పుట్టిచ్చో... ఆడు మంచోడని పెసారం సెయ్యించో... సేద్దాం. అంతేనా!?"

"అంతేనా అంటే... ఇంకా శానా ఉన్నయ్... మా టీటీడీ సేర్మను బాగా తెలీగలోడండి. ముదురు. ఓ పదేల్లు టీటీడీ సేర్మన్‌గానే ఉంచాలండి.ఎంతవుద్ది!"

"రేట్ లిస్టు సూసి సెప్పాలి. అంతే నా?"

"అంతే నా అంటే.... ఏం సెప్పను!? బోలెడన్ని ఉన్నయ్. నాకు ఎమ్మెల్సీ ఒకటి ఇప్పియ్యాలండి. కలెక్షన్లు బొత్తిగా లేక... సూడండి ఎట్టా ఎండి పోయానో. మా బామ్మరిదికి బెజాడలో మెట్రో రైలు పని ఇప్పియ్యాలండి.

మేగా కిస్టారెడ్డికేమో... ఇశాకపట్నం మెట్రో రైలు ఇప్పియ్యాలి. సిర్డీ సాయి ఎలట్రికల్సోడు ఉన్నాడు కదండీ.... ఆడికి ఎలెట్రిసిటీ డిపాట్మెంటు ఓలు మొత్తం రాసిచ్చేయాలండి. ఎంతవుద్ది!?. మీరు



రేట్లు తేల్సడంలేదు మరి.

మా గౌర్మెంటులో శానా యవ్వారాలు ఉన్నయ్ మొత్తం క్యాస్ అండ్ క్యారీ అండి. మీకు, నాకూ అగ్రిమెంట్ కుదిరితే.... మా గౌర్మెంటు టోటలుగా తెచ్చి మీ సేతుల్లో ఎడతా. నాకు... నూటికి మూడు పర్సెంటు కమిసనివ్వండి."

"ఇదంత అర్రి బుర్రిగా తేలే యవ్వారం కాదు. రేట్ లిస్టు సూసి మా సెగట్రీ సెబుతాడు. ఇదుగో ఓ కొబ్బరి బొండాం పుచ్చుకోండి. ఇందుట్లో అది కలిపాను."

"సూడు సెగట్రీ. ఈడి యవ్వారం ఏదో... కొంచెం డౌటుగా ఉంది. నువ్వు ఈణ్ణి బాగా స్టడీ సెయ్. నిజంగా బిగినెస్ పని మీదే వొచ్చాడా.... లేక, మన కూపీ ఏమన్నా లాగడానికొచ్చిన ఇంటిలిజెంసోడా సూడు. డౌటొస్తే.... డిక్కీలో తొంగో బెట్టెయ్."

"యస్సర్. డెడ్ బాడీని పూడ్చి పెట్టించనా? తగలెట్టించినా?"

"నువ్వేం సెగట్రీవయ్యా!? మళ్లీ అదో కర్మా మనకి? ఈడి శవాన్ని రేత్రయ్యేదాకా మన సెడ్లో దాచేసి, పొద్దు పోయాక... మన సోవిరెడ్డి సెంద్ర మోహన్‌రెడ్డి పక్కలో తొంగోబెట్టి, గోవర్ధన్‌రెడ్డికో ఫోన్ గొట్టు. ఎస్పీక్కూడా సెప్పు. ఆల్లు ఆల్లు సూసుకుంటారు. పెసోళ్ళకీ మంచి కాలక్షేపం. ఈ గొట్టాలోళ్ళు అయిచ్చుకుని అటూ ఇటూ లగెత్తుతుంటారు. మనం రేపు అలా సర్దాగా వాకింగుకు ఎల్లినట్టు ఎల్లి సోవిరెడ్డిని పరామర్శించి వద్దాం."

"అన్నట్టు మొన్న ఆడు.... మన బొంగయ్య గాడికి కార్పొరేసన్ శైర్మన్ పదవి ఇప్పించాం గందా! బ్యాలెన్స్ పైసలిచ్చాడా?"

"ఎస్సర్. ఇదిగోండి..."

"ఇదేంటి... కట్ట సన్నగా ఉంది?"

"యస్సర్. ఆడికి పదవిచ్చారు గానీ, ఆఫీసు, కుర్చీ, కారు ఇవ్వలేదంట. టీ తేవడానిక్కూడా మనిషి లేడంట. ఏం చెయ్యాలో పని కూడా సెప్పలేదంట. అడిగితే, కుర్చీ ఇవ్వాలా... వద్దా? సిన్న కుర్చీ ఇవ్వాలా... లేకపోతే, పెద్ద కుర్చీ ఇవ్వాలా? పాత కుర్చీ ఇవ్వాలా... కొత్త కుర్చీ ఇవ్వాలా? ఏ రకమైన కారు ఇవ్వాలి? ఒకటో నంబర్ లిస్టులో అణ్ణి పెట్టాలా? రెండో నంబర్ లిస్ట్‌లో పెట్టాలా? ఇయ్యన్నీ డిస్కస్ సేయడానికి పొలిట్‌బూరో మీటింగ్ ఎయ్యాలంట. ఇంకో మూడేళ్లు పోయాదాకా పెద్దాయనకేమో ఖాళీ లేదని చెబుతున్నారంట. పెట్టుబడులు పెట్టుబడులు అని ఎటోకటు వెళ్లిపోతున్నాడంట. సేతికి దొరకడం లేదంట. ఇంకో మూడేళ్లు ఆగిరా... అప్పుడిస్తాం అన్నీ అంటున్నారంట. అందుకని టీవీల్లో షేర్లు, లాభాలు–నష్టాలు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడంట. ఇప్పుడు సగమే ఇచ్చాడు సర్."

– భోగాది వేంకట రాయుడు



# కార్యకర్తలే..మా పార్టీ హీరోలు!

## • ఎమ్మెల్యే సోమిరెడ్డి

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే హీరోలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశంసించారు. ఈనెల 13వ తేదీ గురువారం ఆయన వెంకటాచలం మండలంలోని చెముడుగుంటలోని శ్రిడ్స్ కల్యాణమండపంలో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. తొలుత, తెలుగుదేశం పార్టీ జెండాని ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అయిదు మండలాల ప్రధాన కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీలు, క్లస్టర్, యూనిట్, గ్రామకమిటీల నాయకుల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో ప్రధానంగా నరకం అనుభవించింది సర్వేపల్లి టీడీపీ శ్రేణులేనని, అక్రమ కేసులకు ఎదురొడ్డి నిలిచారని, కార్యకర్తల రుణం తీర్చుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు.

# రెడ్‌క్రాస్‌కి అధునాతన పరికరం

## సెయిల్ ఎనర్జీ ఇండియా వారి వితరణ



నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధికి ఈనెల 10న సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ వారు అత్యంత అధునాతనమైన రిఫ్రెజిరేటెడ్ సెంట్రీఫ్యూజ్ మెషీన్ (రక్త భాగాల విభజన యంత్రం)ని తమ విరాళంగా అందజేశారు. రాష్ట్రంలోనే ఇలాంటి వితరణ తొలిసారని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఆ కంపెనీ ఛైర్మెన్ తారక్ మహమ్మద్, ఆయన సతీమణి నదియా ఆల్ బటాషి, డైరెక్టర్ సైరస్ ఎరచ్ కూపర్–ఆయన సతీమణి షేర్ణకూపర్, సీఇఓ జె,.. మహాపాత్ర..ఆయన సతీమణి పుష్ప మహాపాత్ర తదితరులు పాల్గొని ఆ యంత్రాన్ని రెడ్‌క్రాస్‌కి బహుకరించారు. తలసీమియా సేవ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ సీత, బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్, రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మెన్ చమర్తి జనార్ధన్‌రాజు, క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి, రెడ్‌క్రాస్ మాజీ ఛైర్మెన్ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం, ఏఆర్‌వి క్లినిక్ సభ్యులు బిరదవోలు వెంకురెడ్డి, డాక్టర్ వరప్రసాద్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 14 నుంచి..

# గ్రంథాలయ వారోత్సవాలు

ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నెల్లూరు నగరంలోని రేబాల వారి వీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ వారోత్సవాల సందర్భంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, మహిళా సాధికారతపై చర్చా గోష్టి తదితర కార్యక్రమాలతోపాటు విద్యార్థినీ విద్యార్థులకు వివిధ విజ్ఞాన దాయక పోటీలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజాతో కలసి జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

# లోకేష్‌ని కలిసిన సుమంత్‌రెడ్డి



టీటీడీ ఉత్తర భారతదేశ స్థానిక సలహా మండలి అధ్యక్షుడిగా నియమితులైన ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి ఇటీవల టీడీపీ యువనేత నారా లోకేష్‌ని కలుసుకున్నారు. తనకు శ్రీవారి సేవకి సంబంధించిన బాధ్యతను అప్పగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సుమంత్‌రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. యాత్రికుల సౌకర్యాలను మెరుగుపరచడం, సేవలను క్రమబద్ధీకరించడం వంటి కార్యక్రమాలతో టీటీడీ పేరుప్రతిష్టలను ఇనుమడింపజేసేందుకు కృషిచేస్తానని ఆయన లోకేష్‌కి చెప్పారు.

# పుణ్యదంపతులకి అక్షరాంజలి!



## కీ॥శే॥ వల్లూరు నాగభూషణం గారు - కీ॥శే॥ వల్లూరు మధుసూదనమ్మ గారు

(విశ్రాంత గెజిటెడ్ తహశీల్దార్ మరియు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి గారి మాజీ వ్యక్తిగత కార్యదర్శి)

నాకు ఊహ తెలిసేసరికి మా అక్క మధుసూదనమ్మ గారికి నాగభూషణం మామతో పెళ్లయిపోయింది.
(ఆయన మా అమ్మకి తమ్ముడు, నాకు మేనమామ)

నాకు ఏడేళ్ళు వచ్చేసరికి మా నాన్న శ్రీ సిద్ధయ్యనాయుడు దైవసాన్నిధ్యం పొందడంతో... నన్నూ, మా అమ్మ శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారినీ, మా అన్న చంద్రశేఖరం గారినీ నాగభూషణం మామ చేరదీశారు.

నన్ను ఉన్నత చదువులు చదివించారు. నాతోపాటు చదువుల నిమిత్తం వచ్చిన పెద్దమ్మ, పిన్నమ్మల పిల్లలనందరినీ తమ పిల్లలతో సమానంగా చూసేవారు ఆ పుణ్యదంపతులు.

పల్లెలలో విద్యా వసతి అంతగా లేని 1960-1970 దశకాల్లో వీరిద్దరూ విద్యాదానం చేసి పుణ్యం మూటకట్టుకోవడం వల్లనే.. ఇప్పుడు వీరి మనుమలు, మనుమరాళ్ళు ఇండియాతో పాటు అమెరికా, కెనడా దేశాల్లో స్థిరపడ్డారు.

కష్టములో వున్న వారిని ఆదుకోవడం తన విద్యుక్త ధర్మంగా భావించేవారు నాగభూషణం మామ. కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్నప్పుడు జమాబందీ సమయంలో సస్పెన్షన్‌కు గురైన కరణంలు, మునసబులు మామ వద్దకు వచ్చేవారు. రెవెన్యూ శాఖలో నియమ నిబంధనల మీద పట్టున్న అధికారి కావడంతో వారికి అనుకూలమైన అంశాలను పైఅధికారులకు విశదీకరిస్తూ ఫైలు వ్రాసి, వారిని తిరిగి విధుల్లోకి తీసుకొనేలా అధికారులను ఒప్పించేవారు.

అదేవిధంగా, గనుల శాఖలో పనిచేసి ప్రభుత్వ ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచడానికి దోహదం చేసినందుకు ఎస్ఆర్ శంకరన్ వంటి జిల్లా కలెక్టర్ల అభినందనలు అందుకొన్నారు.

మండల పరిపాలన అమల్లోకి వచ్చాక రెవెన్యూ అధికారుల విధులు, బాధ్యతలను క్రోడీకరించి "Manual of State Revenue Administration" (శాసన, నియమనిబంధన సంగ్రహము) అనే గ్రంథాన్ని స్వయంగా రచించి ప్రచురింపచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో క్రొత్తగా చేరినవారికి కూడా విధి నిర్వహణలో ఆ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రాష్ట్ర అధికారుల అభినందనలు అందుకొన్న నాగభూషణం మామ నీతి నిజాయితీలకు మారుపేరు.

అప్పట్లో నిస్వార్థ ప్రజా సేవకులైన కీర్తిశేషులు శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు, శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారు, ఇంకా ప్రస్తుత ఒంగోలు ఎంపీ శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గారి వద్ద మాగుంట ప్రజాసంబంధాల కార్యాలయములో పనిచేస్తూ మాగుంట చారిటీస్ సంస్థల సహకారంతో ఎంతోమంది బడుగు బలహీన వర్గాలు మరియు మాజీసైనికుల సమస్యలను పరిష్కరించడంలో వారికి అన్ని విధాలా సహాయపడేవారు.

నవంబర్ 15న దీనజన బాంధవుడు శ్రీ నాగభూషణం మామ వర్ధంతి సందర్భంగా 'మానవ సేవే.. మాధవ సేవ' అనే పెద్దల మాటను తమ జీవితాంతం ఆచరించి చూపించిన ఆ పుణ్యదంపతులను స్మరించుకుంటూ... అక్షరాంజలి ఘటిస్తున్నాము.

ఇట్లు : శ్రీమతి & శ్రీ నిడిగంటి గోవర్ధనరావు
విశ్రాంత అధికారి, వాణిజ్య పన్నుల శాఖ, నెల్లూరు.
చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ 2025/2026, శాక్రమెంటో CA, శంకర నేత్రాలయ, యు.ఎస్.ఏ
బృంద సభ్యుడు, తెలుగు సాహిత్య వేదిక, నెల నెలా తెలుగు వెన్నెల, ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం TANTEX, డల్లాస్ ఫోర్ట్‌వర్త్, యు.ఎస్.ఏ

లాయర్
నవంబర్ 14, 2025

# కాలుష్యం కాటుతో.. ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి!

దేశ రాజధాని ఢిల్లీ ఇప్పుడు విషపూరితమైన కాలుష్యపు గాలులతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఆ మహానగర ప్రజలు హాయిగా..మంచి గాలి పీల్చుకునేందుకు కూడా నోచుకోలేని దయనీయ పరిస్థితి ఏర్పడింది. దీంతో, శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతుండడతో చిన్నా-పెద్దా అంతా సతమతమైపోతున్నారు. గాలి నాణ్యత బాగా తగ్గిపోతుండడంతో, చివరికి ప్రాణాలు ఏమైపోతాయోననే భయం అంతటా ఆవరిస్తోంది. ఈ విషమ పరిస్థితిలో ఇక చేసేదేమీ లేక, ప్రజలు ఇండియాగేట్ వద్ద నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా చలికాలంలో వణికిపోయే ఢిల్లీ, వాయుకాలుష్యంతో ఇప్పుడు ప్రాణభయంతో బెంబేలెత్తిపోతోంది. పేరుకే గొప్ప రాజధాని.. కానీ ఇక్కడ బతకడమే దినదినగండంగా ఉంటోందని ప్రజలు ఆవేదన.. ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీలో కాలుష్య వాతావరణం గతంలోనూ ఉన్నా, ఇంతటి దారుణ పరిస్థితులు మాత్రం ఎప్పుడూ లేవు. ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా ఇప్పుడు ఢిల్లీ పేరే వినిపిస్తోంది. గాలిలో ప్రమాదకరమైన పీఎం-2.5 అనే రేణువులు క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు మించితే ఊపిరి తీసుకోవడం కూడా కష్టమైపోతుందని నిపుణులు చెప్పున్న నేపథ్యంలో, ఇప్పటికే ఢిల్లీలో ఆ రేణువులు అంతకు 120 రెట్లు పెరిగిపోవడం ప్రజలను హడలెత్తిస్తోంది. ఇంకాస్త వివరంగా చెప్పాలంటే, వాయునాణ్యతా ప్రమాణాల ప్రకారం గాలి నాణ్యత సూచీ 300-400 మధ్య ఉంటేనే ఆరోగ్యానికి అత్యంత ప్రమాదం కాగా, ఢిల్లీలోని దాదాపు పది ప్రాంతాల్లో అది ప్రస్తుతం ఏకంగా 400 మార్కు దాటిపోయింది. దీంతో కళ్ళు, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడుతుండడంతో పెద్దసంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ కాలుష్యం దెబ్బకి ఇతర ప్రాంతాల వారు ఢిల్లీకి వెళ్ళడానికి భయపడిపోతున్నారంటే అతిశయోక్తి కాదు. ఈ చలికాలంలో దట్టమైన పొగమంచుతో రోడ్లు మూసుకుపోతున్నాయి. ఇంకొద్దిరోజుల్లోనే ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలకు పడిపోయే ప్రమాదం కూడా ఉందంటున్నారు. రాబోయే మూడు నెలలు మరింత చలి వాతావరణం ఉంటుంది. ఈలోగా ఇక్కడెలా బతకాలా అని ప్రజలు అయోమయంలో పడిపోతున్నారు. ఒకప్పుడు పచ్చని ప్రకృతితో గ్రీన్ క్యాపిటల్ (హరిత రాజధాని) ఉన్న ఢిల్లీ, ఇప్పుడు కాలుష్యకేంద్రంగా తయారైంది. తాజా పరిణామాలతో ఢిల్లీలోని అనేక ప్రాంతాలను ప్రభుత్వం రెడ్‌జోన్‌లుగా ప్రకటించింది. మరీ అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ళ నుంచి బయటకు రావొద్దని కూడా వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. నిత్యం లక్షలాది వాహనాల రాకపోకలతో గాలి బాగా కలుషితమైపోతోందని, దాంతో పాటు పరిశ్రమల ఉద్గారాలు, వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టడం వంటి వాటితో వాయుకాలుష్యం భారీస్థాయిలో పెరిగిపోతోందని నిపుణులు చెప్తున్నారు. దేశాన్నే శాసించే అధికార వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, కేంద్రప్రభుత్వ యంత్రాంగం అన్నీ ఢిల్లీలోనే ఉన్నా, ఈ కాలుష్యపు కాటు నుంచి ప్రజలను రక్షించలేకపోవడం బాధాకరం. సుప్రీం కోర్టు కూడా దీనిపై స్పందిస్తూ, కాలుష్య నివారణకు ప్రభుత్వాల నుంచి సరైన చర్యలు ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి శాశ్వత పరిష్కారాన్ని చూడకపోతే ఢిల్లీ తన ప్రత్యేకతను, ప్రతిష్ఠను కోల్పోతుందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీన్నుంచి బయటపడడానికి ఢిల్లీని వదిలి వెళ్ళడం మినహా మరో మార్గాంతరం లేదని అనేకమంది భావిస్తున్నారు.

నిత్యం కోట్లాది వాహనాల కాలుష్యం ఢిల్లీని కమ్మేస్తోంది. మరోవైపు పరిశ్రమల కాలుష్యం, పంట వ్యర్థాల కాలుష్యం, విద్యుదుత్పాదన కేంద్రాల వల్ల కలిగే కాలుష్యం అన్నీ కలసి వెరసి ప్రజల ప్రాణాలమీదికి వస్తున్నాయి. ముఖ్యంగా, ఢిల్లీ చుట్టుపక్కలున్న రాష్ట్రాల నుంచి పంటవ్యర్థాలను భారీ స్థాయిలో తగులబెడుతున్నందు వల్ల ఆ పొగతో పాటు ఏర్పడే కాలుష్యమే ప్రధానమైన ప్రమాదంగా పరిణమిస్తోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఢిల్లీకి ఇరుగుపొరుగుగా ఉన్న హర్యానా-పంజాబ్‌లో పంటవ్యర్థాలు తగులబెట్టడం వల్ల ఢిల్లీపై కరగని కాలుష్యమేఘాలు ఏర్పడుతున్నాయి. ఈ కాలుష్యం క్రమేణా దేశమంతా వ్యాపించే ప్రమాదం కూడా ఉందంటున్నారు. ఏదేమైనా, ప్రభుత్వాల నుంచి కట్టుదిట్టమైన చర్యలు లేకపోవడంతోనే ఈ కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. ఇదింకా జటిలంగా తయారై, ప్రజల ప్రాణాలకు పెనుముప్పుగా మారక ముందే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని, శాశ్వత ప్రాతి పదికపై తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## మహాపచారం.. తిరుమల నెయ్యి వ్యవహారం

తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారంలో విస్తుగొలిపే విషయాలని దర్యాప్తు అధికారులు వెల్లడి చేస్తున్నారు. సుమారు 250కోట్ల విలువచేసే 63 లక్షల కిలోల కల్తీ నెయ్యి కొనుగోలు చేసినట్లుగా వారు లెక్కలు తేల్చారు. తిరుమల తిరుపతి దేవస్థానాల అదనపు ఈఓగా ధర్మారెడ్డి పనిచేసిన కాలంలోనే ఇదంతా జరిగిందని దర్యాప్తు అధికారులు చెప్తున్నారు. తనకి ఎదురులేదన్న ధీమాతో ధర్మారెడ్డి వ్యవహరించాడు. ఏకఛత్రాధిపత్యంతో, నిరంకుశతత్వంతో తన పదవీకాలాన్ని వెలగబెట్టాడు. తాడేపల్లి ప్యాలెస్ పెద్దని నెల నెలా లక్ష్మీ కటాక్షంతో ప్రసన్నం చేసుకుంటూ స్వామివారి చెంత దుర్మార్గాలకు పాల్పడ్డాడు. ధర్మారెడ్డి హయాంలో ఇదేకాకుండా ఇంకా అనేక దుర్మార్గాలు జరిగినట్లు అక్కడ సిబ్బందే చెవులు కొరుక్కుంటున్నారు. వందల కోట్ల అవినీతి జరిగిందని గుసగుసలాడుకుంటున్నారు. దర్యాప్తు అధికారులు ఆ లెక్కలన్నీ తేల్చి, స్వామివారి సొమ్ముని కక్కించాలి. భక్తుల మనోభావాలతో, వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుకుంటూ స్వామివారి సొత్తుని స్వాహా చేసిన ఇలాంటి అధర్మ అధికారిని ఉరి తీసినా తప్పులేదు.

లక్ష్మి భరద్వాజ్, హైదరాబాదు.

## చింతారెడ్డిపాళెం కూడలి వంతెన త్వరితగతిన పూర్తిచేయాలి

నెల్లూరు నగరంలోని చింతారెడ్డిపాళెం కూడలి వద్ద జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 115 కోట్ల రూపాయల నిధులని కేటాయించి అనుమతులని మంజూరు చేసిందని మునిసిపల్ మంత్రి నారాయణ గారు ప్రకటించడం శుభపరిణామం. గత ఇరవై ఏళ్లుగా ఇక్కడ తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అమాయక ప్రజల ప్రాణాలు బలవుతున్నాయి. ఈ విషయంపై అనేక పార్టీల నేతలు తరచూ ధర్నాలు, నిరసనలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇన్నేళ్ళకు ఈ సమస్యకు పరిష్కారం లభించింది. చింతారెడ్డిపాళెం ఫ్లైఓవర్‌కి సంబంధించిన ఫార్మాలిటీలన్నీ త్వరతగతిన పూర్తిచేసి వంతెన నిర్మాణ పనులని వేగవంతం చేయవలసిందిగా నా మనవి. ప్రజల అసౌకర్యాన్ని గుర్తించి ఈ ఫ్లైవర్‌ని మంజూరు చేయించడంలో చొరవచూపిన మంత్రి నారాయణ గారికి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారికి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు గారికి నెల్లూరు పురజనుల పక్షాన నా ధన్యవాదాలు!

సీ. హెచ్. సుధీర్, సరస్వతినగర్.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## నోరు పారేసుకుంటున్న మాజీలు

మొన్నటి దాకా అధికారంలో ఉండి అహంకార పోకడతో విర్రవీగిన వైసీపీ నేతలు అయిదేళ్ళు ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు. అనుక్షణం అసహనాన్ని ప్రదర్శిస్తూ రెచ్చిపోతున్నారు. తమ ఇష్టానుసారం నోళ్లు పారేసుకుంటున్నారు. వినడానికే అసహ్యం కలిగే జుగుప్సాకరమైన భాషతో అధికారపార్టీ నేతలని దుమ్మెత్తిపోస్తున్నారు. జైలు జీవితం గడిపొచ్చిన కాకాణి లాంటి వాళ్ళయితే మరీ బరితెగించి మాట్లాడుతున్నారు. మమ్మల్ని ఇంతకంటే ఏమి పీకగలరన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు. తడ నుండి ఇచ్ఛాపురం వరకూ రాష్ట్రమంతా ఇదే పరిస్థితి. గత ప్రభుత్వంలో ఈ నాయకుల వ్యవహారశైలి కారణంగానే 2024లో ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారు. అయినా, వీళ్ళకి బుద్ధి రాలేదు. ఇదే తీరు కొనసాగిస్తే వీళ్లంతా శాశ్వతంగా మాజీలుగా మిగిలిపోవడం ఖాయం. దిగజారిన ఆధునిక రాజకీయాలని, నయాతరం నేతలని చూస్తుంటే రాజకీయాలంటేనే అసహ్యం కలుగుతోంది!

జీ.వీ.సుబ్బయ్య, పిడుగురాళ్ళ.

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 116

## నేతలు మారుతున్నా..
# నేతన్నల తలరాతలు మారడం లేదు!

*"గాలిలోన తేలిపోయే చీరగట్టిన చిన్నదానా..*
*జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా?..*
*చిరుగు పాతల బరువు బతుకుల నేతగాళ్ళే నేసినారు..*
*చాకిరొకరిది సౌఖ్యమొకరిది సాగదింక తెలుసుకో!"*

దాదాపు ఆరుదశాబ్దాల నాటి పాట ఇది.

1957లో 'తోడికోడళ్ళు' సినిమాలో మనసుకవి ఆత్రేయ రాసిన ఈ పాటలోని పదాలు నాటి నేతకారుల బరువు బతుకులకు అక్షరసాక్ష్యాలు. కానీ, ఆనాటి నుండి ఈనాటి దాకా కూడా ఆ దీనస్థితుల నుంచి నేతన్నల బతుకులు పెద్దగా మారిందేమి లేదు. తరతరాలుగా మన సంప్రదాయంలో చేనేత ఒక భాగంగా ఉంది. వారసత్వంగా వస్తున్న ఆ వృత్తినే నమ్ముకుని, నేటికీ లక్షలాదిమంది నేతకారులు తమ జీవితాలను గడుపుతున్నారు. కానీ, ఏళ్ళు గడుస్తున్నా వారి జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుంటున్నాయి. ఒకప్పట్లో చేనేతకి ఎంతో ప్రాముఖ్యత ఉండేది. స్వాతంత్ర్యోద్యమకాలంలో విదేశీ వస్త్ర బహిష్కరణలు కూడా జరిగాయి. స్వదేశీ ఉత్పత్తులను పునరుద్ధరించుకోవాలన్న గాంధీజీ పిలుపుతో జాతీయస్థాయిలో చేనేతకి ప్రాధాన్యత పెరిగింది. 1905లో కలకత్తాలో జాతిపిత బాపూజీ పిలుపుతో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా, ఆ తర్వాత నుంచి మనం జాతీయ చేనేత దినోత్సవం కూడా జరుపుకుంటున్నాం. అయితే, అదంతా గతం. ఇప్పుడదంతా కాలగమనంలో కలసిపోయింది. నానాటికీ చేనేతకు ఆదరణ కరువైంది. పాలకుల ప్రోత్సాహం కూడా నామమాత్రమైంది. ఫలితంగా చేనేతల బతుకు భారమైంది.

### కష్టాల సుడిగుండంలోనే..చేనేతకారులు :

మనిషై పుట్టాక కూడు, గూడు, గుడ్డ ఎవరికైనా అవసరమే. అందుకే, దేశానికి అన్నంపెట్టే రైతన్న, మనిషికి వస్త్రాలందించే నేతన్న ఇద్దరూ కూడా సమాజానికి రెండు కళ్ళు అయ్యారు. నేత అంటేనే నైపుణ్యానికి ప్రతీక. అగ్గిపెట్టెలో పట్టే చీరను సైతం అద్భుతంగా నేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరచిన దేశం మనది. రాట్నం తిప్పడంలో, నూలు వడకంలో మనకు మించినవారు లేరు. ముఖ్యంగా మన నేతన్నలు దేశానికే గర్వకారణం. స్వాతంత్ర్యం ముందుకాలంలోనూ, ఆ తర్వాత కూడా ప్రజలు ఎక్కువగా నేతవస్త్రాలనే ధరించేవారు. అయితే, కాలక్రమేణా ఆధునిక యంత్రాలు రావడంతో చేతివృత్తులకి చేతులు విరిగినట్లయింది. మరమగ్గాలు రావడంతో మగ్గం గుంటల్లో దిగి, చేతితో వస్త్రాలు నేసే చేనేతకారుల పరిస్థితి సంకటంగా మారింది. రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకున్నా చివరికి పూటగడవని వారెందరో ఉన్నారు. మార్కెట్లో ముడిసరుకుల ధరలు బాగా పెరిగిపోవడం, ఎంత కళాత్మకంగా వస్త్రాలు నేసినా వాటిని కొనేవారు లేకపోవడం, మార్కెటింగ్ సదుపాయాలు కొరవడడంతో చేనేతరంగం కుదేలైపోతోంది. కోట్లాది రూపాయల విలువైన నేతవస్త్రాలు చేనేత సహకార సంఘాల్లో నిల్వ ఉంటున్నా, వాటిని ఎప్పటికప్పుడు విక్రయించుకుని చేనేతకారుల జీవనభృతికి తోడ్పాటునందించేందుకు తగ్గ వ్యవస్థలు క్షేత్రస్థాయిలో లేకపోవడం ఒక పెద్ద లోటు.

### సమస్యలు వినేవారూ లేరు.. తీర్చే నాథులూ లేరు :

ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా చేనేతకారులు లక్షల సంఖ్యలోనే ఉన్నారు. 2020నాటి లెక్కల ప్రకారం దేశంలో 31.45 లక్షల కుటుంబాలు చేనేత వృత్తిలో ఉన్నాయి. ఇప్పుడా సంఖ్య భారీగా పెరిగి ఉంటుంది కూడా. వంశపారంపర్యంగా వస్తున్న ఆ వృత్తిలోనే నేతకారులు తమ జీవితాలను కష్టాలతోనే సాగిస్తున్నారు. చెప్పుకుంటూ పోతే చేనేతకారుల సమస్యలు కొండవీటి చాంతాడంత ఉన్నాయి. ముడిసరుకుల ధరలు పెరగడం, యంత్రాలతో తయారయ్యే భారీ పోటీని ఎదుర్కోలేని అసహాయత, ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం, మార్కెట్‌లో చేనేత వస్త్రాలను కొనేవారు బాగా తగ్గిపోవడం వంటి ఎన్నోరకాల సమస్యలతో చేనేతలు నేటికీ నలిగిపోతున్నారు. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు చేనేతరంగంపై ఉన్న జీఎస్టీని 12 నుంచి 18 శాతానికి పెంచడంతో ఆ వస్త్రాల ధరలు పెరిగి, కొనేవారు కూడా వెనక్కిపోతున్నారు. యంత్రాలతో తయారుచేసే వస్త్రాలకి జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించడంతో ఆ వస్త్రాలనే ఎక్కువగా కొంటున్నారు. జీఎస్టీ పెనుభారంగా మారడంతో నేతకారులు తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోలేక దిగాలుపడిపోతున్నారు.

ప్రభుత్వాలు చేనేతరంగాన్ని ప్రోత్సహిస్తున్నామంటూ అనేక పథకాలు అమలులోకి తెస్తున్నాయి కానీ, వారికి వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి మాత్రం కృషి చేయడం లేదు. దీంతో నేతకారులెందరో అప్పుల సుడిగుండంలో పడి అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా ముడిసరుకుల ధరలు తగ్గించి, నేతకారులకు రాయితీలతో అందించాలి. జీఎస్టీని కూడా సవరించి చేనేతరంగానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి. నగరాలు, పట్టణాల్లో అక్కడక్కడా ప్రభుత్వాల పక్షాన, చేనేతసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న చేనేత మేళాలలో వాటి విక్రయాలు కొంతమేరకు ఆశాజనకంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో, అలాంటి విక్రయ కేంద్రాలను దేశవ్యాప్తంగా వీలైనన్ని ఎక్కువ చోట్ల ఏర్పాటుచేయాలి. చేనేతకారుల అభ్యున్నతికి ఆశాజనక పథకాలను ప్రవేశపెట్టాలి. ఏళ్ళతరబడిగా నేత వృత్తినే నమ్ముకుని బతుకుతున్న నేతకార్మికులను, వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరింత పటిష్టమైన పథకాల్ని రూపొందించి, నేతన్నలని ప్రోత్సహించడం అవసరం!

- రాజశ్రీ

# సోమవరప్పాడుకు ఆధ్యాత్మిక శోభ



జలదంకి మండలం సోమవరప్పాడు గ్రామంలో ఇటీవల ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెల్లుబుకాయి. దాతలు చేవూరి జనార్ధన్‌రెడ్డి-సులోచనమ్మ దంపతుల దాతృత్వంతో నిర్మించిన శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ సోమనాథస్వామి మరియు శ్రీ సాయిబాబా నూతన ఆలయ మహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఇటీవల వైభవంగా జరిగాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు, దాతలు సమిష్టిగా కృషిచేసి ఆలయ నిర్మాణం పూర్తిచేయడం సంతోషకరమని వారు అభినందించారు.

# మహత్తరం.. వందేమాతరం!




వందేమాతర గీతం మహత్తరమైనదని, 1875లో బంకిమ్‌చంద్ర ఛటోపాధ్యాయ రాసిన ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక ప్రేరణగా నిలిచిందని నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. 'వందేమాతరం' 150వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల స్థానిక జడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'వందే మాతరం' అనే రెండు పదాలు మన దేశమాతకు వందనం చేసే గాఢమైన భావనను వ్యక్తం చేస్తాయన్నారు. ఈ గీతం మనలో దేశభక్తిని, త్యాగాన్ని, ఐక్యతను నింపుతుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు ఈ గీతాన్ని తమ హృదయ గీతంగా స్వీకరించారని, ఇది కేవలం గీతం కాదు.. అది భారత ఆత్మను ప్రతిబింబించే శబ్దరూపమని ఆమె కీర్తించారు. అనంతరం, జడ్పీ ఇన్‌ఛార్జి సీఈఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సిబ్బందితో కలసి వందేమాతరం గీతాన్ని గానం చేశారు.

# బాధ్యతలు చేపట్టిన.. భువనేశ్వరిప్రసాద్



బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొత్తగా నియమితులైన నెల్లూరుకి చెందిన ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ ఇటీవల విజయవాడలోని బ్రాహ్మణ సంక్షేమ సంస్థ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా, ఆ సంస్థ ఛైర్మెన్ రాంప్రసాద్ ఆయనను అభినందించారు. అనంతరం జరిగిన కార్పొరేషన్ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం తనవంతు కృషిచేస్తానని భువనేశ్వరి ప్రసాద్ చెప్పారు.

# మహిమాన్విత క్షేత్రం.. క్షీరారామం!



ఈ పవిత్రమైన కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలను దర్శించుకోవడం పుణ్యప్రదమని, అందులోనూ పంచారామాల్లో ఒకటైన క్షీరారామం మరింత మహిమాన్వితమైన శైవక్షేత్రమని, ఈ ఆలయంలోని శివలింగం సాక్షాత్తూ మహావిష్ణువుచే ప్రతిష్ఠించబడిందని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ తెలిపారు. ఇటీవల నెల్లూరులోని పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్తీకమాస ప్రవచనాలలో ఆయన 'క్షీరారామం' విశిష్టత గురించి వివరించారు. 9 అంతస్థులతో, 125 అడుగుల ఎత్తుగల గాలిగోపురంతో ఉన్న ఈ దేవాలయంలో శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి-పార్వతీదేవి అమ్మవారు కొలువై ఉండి భక్తుల పూజలందుకుంటున్నారన్నారు. పాలకొలను, పాలకొల్లు అనే పేర్లను కూడా కలిగివున్న ఈ క్షేత్రం పశ్చిమగోదావరి జిల్లాలో ఉందని, భక్తులు ఈ కార్తీక మాసంలో క్షీరారామంతో సహా పంచారామాలను దర్శించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి సభా పోషకురాలిగా తోట సులోచన, సభా సంచాలకులుగా డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు వ్యవహరించారు. అనంతరం, శ్రీ స్వామి సమయానందనాథ, ప్రముఖ కవి బృందావన రావు, ఆనందకుమార్ తదితరులు పాల్గొని అవధాని కోట రాజశేఖర్‌ని సత్కరించారు.

# సర్వేపల్లి..ఇక 'ప్రగతి పల్లి'

## • 5 కోట్లతో అభివృద్ధి పనులు



సర్వేపల్లి నియోజకవర్గం త్వరలోనే ప్రగతికి నిలయం కానుంది. గత కొద్ది రోజులుగా దాదాపు రూ.5 కోట్ల నిధులతో అక్కడ పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముత్తుకూరు-కృష్ణపట్నంలో తొలివిడత పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇటీవల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కృష్ణపట్నం తుఫాన్ షెల్టర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, కుట్టుశిక్షణ, తాగునీటి పథకం, చెత్త తరలించే రిక్షాలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ ఆ విషయాలు చెప్పారు. ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీలను అదానీ ఫౌండేషన్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తోందన్నారు. పొదలకూరు, వెంకటాచలంలోనూ పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలున్నాయన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న కంపెనీలకి ధన్యవాదాలన్నారు. మరోవైపు ఎస్ఇఐఎల్ కంపెనీ కూడా సీఎస్ఆర్ నిధులతో ప్రగతి పనులు చేపడుతోందని, ముత్తుకూరులో ఒక పెద్ద ఆసుపత్రిని నిర్మించేందుకు కూడా ఆ కంపెనీ ముందుకొచ్చిందని తెలిపారు. ముత్తుకూరులో బీపీసీఎల్ సంస్థ సహకారంతో రూ.7.50 కోట్లతో కేరళ మోడల్‌లో హైస్కూలు నిర్మించబోతున్నారని, పామాయిల్ కంపెనీలు కూడా గిరిజన కాలనీలను దత్తత తీసుకున్నాయని వివరించారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల కోసం ఇళ్లు, భూముల్ని, వ్యవసాయాన్ని, ఆక్వా సాగు వగైరాలన్నిటినీ ఈ ప్రాంత ప్రజలు కోల్పోవడమే కాక, ఆయా సంస్థల కాలుష్యాన్ని కూడా ప్రజలే భరిస్తున్నారని ఆయన అంటూ, అన్ని కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధుల్లో 70శాతం ఈ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ఖర్చుపెట్టాలని విజ్ఞప్తి చేశారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్, రామ్, వేణుగోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాపాలు చేస్తే.. ఫలితం అనుభవించక తప్పదు!

తిరుమల లడ్డూ కల్తీ కుట్రదారుల పాపం పండుతోందని, కోట్లాదిమంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారు అందుకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ కల్తీ విషయంలో జరుగుతున్న విచారణలను ప్రస్తావించారు. సిబిఐ విచారణలో అందరూ నిర్ఘాంతపోయే విషయాలు వెల్లడవుతున్నాయని, దైవప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారికి శిక్ష తప్పదని అన్నారు. వైసీపీ హయాంలో లీటరు నెయ్యికి రూ.20 వంతున కమీషన్ తీసుకుని కల్తీ నెయ్యిని సరఫరా చేయించారన్నది వాస్తవం కాదా అని ఆయన అన్నారు. ఏ కుట్రలూ చేయకపోతే.. బ్యాంకు ఖాతాలు, లావాదేవీల వివరాలను సిట్ కోరినప్పుడు ఆ వివరాలు ఇవ్వడానికి అప్పటి పాలకమండలి పెద్దలకి భయమెందుకని ఆయన ప్రశ్నించారు.

### 117వ సారి..

# అజయ్‌బాబు రక్తదానం



ఒక్కసారి రక్తదానం చేయాలంటేనే భయపడేవాళ్ళెందరో ఉంటారు. కానీ, ఎలాంటి భయాలు, అపోహలు వద్దనే వద్దని, రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, అంతేకాక.. రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని రక్తదాత, రెడ్‌క్రాస్ రక్తనిధి మాజీ కన్వీనర్ సిహెచ్ అజయ్‌బాబు స్పష్టం చేస్తున్నారు. ఈనెల 9న అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఓ రోగికి ఆయన రక్తదానం చేసి ఆదుకున్నారు. ఇది ఆయన 117వ రక్తదానం కావడం విశేషం!

# ఆలయాల్లో దొంగలుపడ్డారు

ఇటీవల కలువాయి మండలంలోని కనుపూరుపల్లి రామాలయం, వెరుబొట్లపల్లి కలకంఠమ్మ దేవాలయాల్లో దొంగలు పడ్డారు. రామాలయం గర్భగుడిలో ఉన్న అమ్మవారి తాళిబొట్లతో పాటు, అలయ హుండీని కూడా ఎత్తుకుపోయారు. కలకంఠమ్మ దేవాలయంలో హుండీతో పాటు, అమ్మవారి కళ్లకు వెండితో అలంకరించిన వస్తువులను సైతం అపహరించుకుపోయారు. గ్రామస్తుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# స్వర్ణలింగేశ్వరునికి కుంభాభిషేకం



నెల్లూరు చెరువు గట్టున, గణేష్ ఘాట్ వద్దనున్న శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థానం వార్షిక కుంభాభిషేకం ఇటీవల అత్యంత వైభవంగా జరిగింది. తుని తపోవనం పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలో ఈ సందర్భంగా పూజలు, రుద్ర హోమం, మహా న్యాసపూర్వక రుద్రాభిషేకం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ, కార్తీకమాసంలో శివకేశవులకు అభేదంగా అభిషేకాలు దీపార్చనలు నిర్వహించాలని పురాణాలు చెబుతున్నాయన్నారు. శ్రీ స్వర్ణలింగేశ్వరునికి భక్తులే స్వయంగా అభిషేకాలు నిర్వహించుకుని, స్వర్ణాల చెరువులో కార్తీక దీపార్చనలు చేసుకునేందుకు ఇది అనువైన ప్రదేశమన్నారు. ఈ ప్రాంతాన్ని, దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు స్వర్ణభారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు పి.సురేంద్రరెడ్డి, దీపోత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ కె.వెన్నెల, కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షులు కోడూరు జయప్రద, పి.సత్యనాగేశ్వరరావు, వ్యాస్ ప్రసాద్, కోడూరు జయరాం, విజయ్‌కుమార్, హర్షవర్ధన్, సరిత, సుభాషిణి, భాస్కరరావు, శ్రీనివాసులు, కామేశ్వరరావు తదితర సభ్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలన్నీ జయప్రదంగా జరిగాయి.

# పీఆర్ ఇంజనీర్ల.. కొత్త కార్యవర్గం




పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం నెల్లూరుజిల్లా శాఖకు ఇటీవల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా రెండోసారి ఎం.బాబురావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా రమేష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.సుధాకర్‌రావు, కోశాధికారిగా వై.వాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏకేవీ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కొత్త కమిటీని పంచాయతీరాజ్ ఎస్ఇ కోటేశ్వరరావు అభినందించారు.

# నెల్లూరు కబుర్లు

### సింహపురి వైద్యసేవాసమితి ఆధ్వర్యంలో

## గిరిజనులకు ఆరోగ్య కార్డులు



నెల్లూరులోని సింహపురి వైద్య సేవా సమితి అధ్వర్యంలో ఇటీవల గిరిజనులకు ఉచిత వైద్యం అందించేందుకు ఆరోగ్య గుర్తింపు కార్డులను అందజేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1వ డివిజన్, కోడూరుపాడు గిరిజన కాలనీలో ఉన్న గిరిజన కుటుంబాల వారికి టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి చేతులమీదుగా ఆ కార్డులను అందజేశారు. ప్రతి గిరిజన కుటుంబం వాటిద్వారా ఉచిత వైద్యం పొందవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జ్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, జై భారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్, శ్రీనివాసులు, టిడిపి కో క్లస్టర్ ఇంచార్జ్ తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం



నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రికి కలికి సుందరరామి రెడ్డి జ్ఞాపకార్థం, ఆయన సతీమణి కలికి రమాకాంతమ్మ, వారి కుమారుడు కలికి రమేష్‌లు రెండు లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డికి ఈనెల11న వారు ఆ మొత్తాన్ని అందించారు.

## నేతల విగ్రహాలను శుభ్రపరచండి



దేశ మాజీ ప్రధానమంత్రులు, మహనీయ నేతలైన జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల జయంతులు ఈ నెల 14, 19 తేదీల్లో నిర్వహించేందుకు వీలుగా, నెల్లూరు నగరంలోని వారి విగ్రహాలను శుభ్రపరచాలని నగర కార్పొరేషన్ కమిషనర్‌కి జిల్లా కాంగ్రెస్ నాయకులు, పీసీసీ సభ్యులు తలారి బాలసుధాకర్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మైనార్టీల విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కె అల్లాఉద్దీన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆ నేతల జయంతి వేడుకలకు వారి విగ్రహాలకు పూల అలంకరణలు చేసి, ఘనంగా నిర్వహించాలని వారు కోరారు.






### అండర్‌బ్రిడ్జిల ఏర్పాటుపై..

## ఎమ్మెల్యే కోటంరెడ్డి సమీక్ష



నెల్లూరులోని కొండాయపాళెం, వేదాయపాళెం రైల్వే గేట్ల వద్ద అండర్‌బ్రిడ్జల నిర్మాణాలపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఈనెల 11న నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన అధికారుల సమావేశం నిర్వహించి, బ్రిడ్జిల నిర్మాణలకు సంబంధించిన విషయాలను చర్చించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, ఆర్డీఓ అనూషతో పాటు రెవెన్యూ, విద్యుత్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే అధినేతలు

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే అధినేతలని, వారిని ప్రోత్సహించేందుకు అన్నివిధాలా కృషిచేస్తామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18వ డివిజన్ నుంచి 41వ డివిజన్ వరకు వివిధ స్థాయిల్లో పదవులు పొందిన నాయకుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలో కష్టించి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో నిరసనల హోరు



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా.. వైసీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ నెల 12న నిరసనలు హోరెత్తాయి. వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సారథ్యంలో యువజన విద్యార్థి విభాగాల నేతలు చేసిన నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మారుమోగింది. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి వైసీపీ నేతలతో కలిసి జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటీకరణ ఆలోచనలను విరమించుకునేలా ప్రభుత్వానికి తమ అభ్యర్థనను తెలియజేయాలని కోరారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి పాలన ప్రారంభం అయ్యేనాటికి. కేవలం 11 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉంటే.. వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా 17 నూతన మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారన్నారు. ఆయా కళాశాలలకు కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకువచ్చి.. ప్రారంభించే క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, మిగిలిన కళాశాలలను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ.. ప్రైవేటు వ్యక్తులకు.. ఆ కళాశాలలను అప్పగించాలనుకోవడం దారుణమని అమన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. వైయస్ జగన్ కోటి సంతకాల సేకరణ.. ప్రజా ఉద్యమ కార్యక్రమానికి పిలుపునిచ్చారని, ఆ ఉద్యమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందన్నారు.

## 16న రక్తదాన శిబిరం

నెల్లూరులోని ఆర్‌విఆర్ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న స్థానిక వెంకటరెడ్డి నగర్ (వేదాయపాళెంలోని కామాక్షమ్మ గుడి దగ్గర) రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సభ్యుడు, ఆర్‌విఆర్ ఫౌండేషన్ ట్రస్టీ ఆర్‌విఆర్ మోహన్‌రాజు తెలిపారు. ఆర్‌వి రాజు ద్విదశాబ్ది స్మరణలో భాగంగా ఏర్పాటుచేసే ఈ శిబిరంలో రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.



## యూనియన్ బ్యాంకు వితరణ

**• విఆర్ హైస్కూలుకు 4 బస్సులు బహుకరణ**

రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చేస్తున్న అభివృద్ధిని చూసి ఎంతోమంది దాతలు అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా నెల్లూరులో పేద విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో విద్యను అందించేందుకు అధునాతన సదుపాయాలతో తీర్చిదిద్దిన విఆర్‌ఎంసి హైస్కూల్‌కు మంత్రి నారాయణ సూచనల మేరకు యూనియన్ బ్యాంక్ వారు తమ సీఆర్‌సీ నిధులతో నెల్లూరు నగరపాలక సంస్థకు కోటీ 20 లక్షల రూపాయల విలువైన నాలుగు స్కూల్ బస్సులను బహూకరించారు. నగరంలోని వి.ఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో మంగళవారం ఆ బస్సులకు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ జెండా ఊపి ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంవీ సుబ్బారెడ్డికి..గ్లోబల్ అవార్డు



నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలట్ హైస్కూలు ఛైర్మెన్ ఎం.వీ సుబ్బారెడ్డికి ఇటీవల దుబాయిలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో 'గ్లోబల్ క్లాస్ రూమ్ అవార్డు' లభించింది. ఫ్యూచర్ ఎడ్ దుబాయ్ 2025 (జీఇఎస్ఎస్) వారు నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచంలోనే విద్యారంగంలో అగ్రగామిగా ఉన్న ఫిన్‌ల్యాండ్ దేశంలోని ఎడ్యుకేషన్ అంబాసిడర్ అను గుట్టోరం చేతుల మీదుగా ఆయన ఆ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించడం విశేషం. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు వంద దేశాల విద్యారంగ ప్రముఖులు, 400 మంది ఎడ్యుకేషన్ ఎగ్జిబిటర్లు, 500 మంది సబ్జెక్ట్ స్పీకర్లు పాల్గొని, తయ దేశాల్లో అనుసరిస్తున్న విద్యావిధానాలను వివరించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నుంచి సుబ్బారెడ్డి హాజరయ్యారు.

## కన్నులపండువగా..కాత్యాయనీ వ్రతం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 11న కాత్యాయనీ వ్రతం కన్నులపండువగా జరిగింది. అమ్మవారికి అనివెట్టి మండపంలో ప్రత్యేకంగా పూల అలంకారం చేసి, వ్రతాన్ని నిర్వహించారు. ఈ వ్రతం వల్ల వధూవరులకు జాతకరీత్యా ఉన్న కుజదోషం, కాలసర్పదోషం వగైరాలన్నీ తొలగిపోయి వివాహాలు శుభప్రదంగా జరుగుతాయని ఆలయ పండితులు తెలిపారు.

## గాండ్ల, తెలికుల కష్టాలు తీర్చాలి

### గ్రోసు సుబ్బారావు విజ్ఞప్తి

రాష్ట్రంలోని గాండ్ల, తెలికుల కులస్థులు దీర్ఘకాలంగా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం వారి కష్టాలు తీర్చాలని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు కోరారు. గాండ్ల తెలికుల సంక్షేమానికి వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల మందికి పైగానే ఈ కులస్థులు ఉన్నారని, ఈ ఆధునిక కాలంలో పెరిగిన యాంత్రీకరణ, వాణిజ్య విధానాల వల్ల కులవృత్తి పూర్తిగా దెబ్బతినడంతో వారు దుర్భర జీవనం గడుపుతున్నారని అన్నారు. గాండ్ల తెలికుల పురోగతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో..

# కోటి కాంతులతో.. లక్ష దీపోత్సవం

**కార్తీకమాసం సందర్భంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల సారథ్యంలో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు కార్తీకమాస లక్షదీపోత్సవం కోటికాంతులతో దేదీప్య మానంగా జరిగింది.**

ఈనెల 6,7,8 తేదీల్లో నెల్లూరు నగరంలోని వీఆర్‌సీ మైదానంలో జరిగిన ఈ వేడుకలకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. భక్తుల శివనామ స్మరణలతో మైదానం మార్మోగిపోయింది.

తొలిరోజు.. ఈనెల 6న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆకాశదీపం వెలిగించడంతో భక్తులంతా దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రవచనంలో కార్తీకమాస దీపోత్సవం విశిష్టతలను వివరించారు. శ్రీ రామానందభారతి స్వాములవారిచే శివలింగోద్భవ కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, శ్రీశైలం దేవస్థానం పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు ఛైర్మెన్ పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యానాయుడు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఉదయం.. విశేష రుద్రహోమం, 108 మంది దంపతులచే శ్రీ మహాలక్ష్మి అమ్మవారి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ తాండవ కాశీక్షేత్ర తపోవన మఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి వారి నేతృత్వంలో జరిగిన పూజల్లో రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీజేపీ నాయకులు ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడవరోజు లక్ష దీపోత్సవంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభంపాటి విజయ రామిరెడ్డి తదితరులు పాల్గొని ఆకాశ దీపాన్ని వెలిగించారు. నాగేశ్వరస్వామికి, పండరీనాథ్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మూడు రోజులూ వీఆర్సీ మైదానం భక్తజనసంద్రంగా మారింది. కార్తీకదీపాలతో, శివకేశవ పూజలతో కళకళలాడింది.



# శ్రీసిటీ అభివృద్ధి ఆనందదాయకం

- ఏపీ ఎన్నికల కమిషనర్




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ, తన భర్త, కేంద్ర ఎలక్ట్రానిక్స్-ఐటీ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి అజయ్ ప్రకాశ్ సాహ్నీతో కలిసి ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. గతంలో అజయ్ సాహ్నీ విలువైన సూచనలతో సాంకేతిక, తయారీ రంగాల్లో శ్రీసిటీకి నూతనోత్సాహం తెచ్చారంటూ డాక్టర్ సన్నారెడ్డి గుర్తుచేసుకున్నారు. వారి చొరవతో ట్రిపుల్-శ్రీసిటీలో జ్ఞాన్ సర్కిల్ వెంచర్స్ స్థాపన, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్(ఇఎంసి) అభివృద్ధి శ్రీసిటీ ప్రగతిలో మైలురాళ్లుగా పేర్కొన్నారు. అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా శ్రీసిటీ అభివృద్ధి చెందడం ఆనందంగా ఉందంటూ నీలం సాహ్నీ అభినందించారు.










6వ వర్ధంతి

మా ఇంటి దీపం, మా ఆరాధ్యదైవం

శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(బుజ్జమ్మ) గారు

(లేట్. చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి, మనుబోలు)

మాకు దూరమై నవంబర్ 19, 2025 నాటికి
ఆరేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని సంస్మరించుకుంటూ..

ఆమె దివ్య ఆత్మకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై

మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై

మనుమరాలు - మనుమడు
శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ


మునిమనుమలు, మునిమనుమరాండ్రు
జయేష్ & అష్మిత ఆకాష్
కీర్తన లక్ష్మి & తనవ్



# ఆకట్టుకున్న ప్రశాంతమ్మ ప్రసంగం

'అన్యాయాలను సహించను, అవినీతిని ప్రోత్సహించను. పొరపాట్లేమైనా జరిగి ఉంటే చెప్పండి..సరిదిద్దుకుంటాను' అంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేసిన ప్రసంగం పార్టీ కార్యకర్తలను, కోవూరు ప్రజలను బాగా ఆకట్టుకుంది. పార్టీ శ్రేణులు..ముఖ్యంగా కార్యకర్తల్లో ఆమె మాటల పట్ల గట్టి భరోసా ఏర్పడింది. ఇటీవల కోవూరు మండలం లేగుంటపాడులో నిర్వహించిన కోవూరు మండల టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆమె ఉద్వేగంగా మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని చెప్పారు. కార్యకర్తలే పార్టీకి అధినేతలని, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తనకి నేరుగా తెలపొచ్చన్నారు. గత ఎన్నికల్లో పాత-కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసినందువల్లనే కోవూరులో తాను 55 వేల మెజారిటీతో గెలుపొందానన్నారు. తప్పుచేస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని తెల్చి చెప్పేశారు. ప్రజాసేవ చేసేందుకు రాజకీయాలలోకి వచ్చానని, కేవలం తాను ప్రజలకు సేవకురాలిని మాత్రమేనని ప్రశాంతిరెడ్డి చెప్పడంతో స్థానిక ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

## బస్సు ప్రమాద మృతుల కుటుంబానికి
# 5 లక్షలు పంపిన వేమిరెడ్డి



ఇటీవల కర్నూలు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన నెల్లూరుజిల్లా వింజమూరు మండలంలోని గోళ్ళవారిపల్లెకి చెందిన గోళ్ల రమేష్ కుటుంబానికి సాయంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 5 లక్షల రూపాయలను పంపించారు. ప్రమాద దుర్ఘటనలో బస్సులో మంటలు చెలరేగి గోళ్ళ రమేష్‌తో పాటు ఆయన భార్య, ఇద్దరు బిడ్డలు కూడా సజీవదహనం కావడం తెలిసిందే. వారి కుటుంబాన్ని ఎంపీ వేమిరెడ్డి సందర్భించి పరామర్శించినప్పుడు, ఆ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు కూడా. చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ, వేమిరెడ్డి ఇచ్చిన 5లక్షల రూపాయల చెక్కును ఆయన సిబ్బంది ఈనెల 11న మృతుని తల్లితండ్రులైన మాలకొండయ్య, సుశీలమ్మలకు అందజేశారు.

# దేశానికే స్ఫూర్తి.. వందేమాతరం!



దేశానికే స్ఫూర్తినిచ్చిన గేయం 'వందేమాతరం' అని, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో వందేమాతర గీతం పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆ గేయంలోని విశిష్టతను తెలియజెప్పారు. దేశ సంఘటితంగా ఉండేందుకు ఆ గేయం ఎంతగానో తోడ్పడిందన్నారు. తొలుత వందేమాతరం గీతాలాపన చేసి, వందనాలర్పించారు. పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పడగ విప్పుతున్న పైశాచికత్వం




దేశంలో మళ్లీ ఉగ్రవాద సర్పం పడగవిప్పి కాటుకు సిద్ధమయ్యింది. నరమేధానికి కొత్త జిత్తులతో ఉగ్ర పిశాచాలు కుట్ర పన్నుతున్నాయి. మునుపెన్నడూ చూడని విధంగా విష ప్రయోగంతో సామూహికంగా ప్రజలను చంపాలని ఉగ్రవాదులు కుట్ర పన్నడం మానవత్వానికి ఎదురైన పెద్ద సవాలు.

కొద్ది రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, ఆ తరువాత భద్రతా సంస్థలు వెలికితీసిన గుట్టు యావత్ భారతావనిని తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఢిల్లీ నడిబొడ్డున ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనతో దేశం ఉలిక్కిపడింది. గుజరాత్ ఏటీఎస్, జమ్మూ & కశ్మీర్ పోలీసులు వెలికితీసిన ఉగ్రకుట్రల గుట్టు దిగ్భ్రాంతికరంగా ఉంది. ఇది పాత ఉగ్రవాదం కాదు. విజ్ఞానం ముసుగులో జడలు విప్పుతున్న సరికొత్త పైశాచిక ఉగ్రవాదం. అత్యున్నత విద్య, 'వైద్య వృత్తి' ముసుగులో, జ్ఞానాన్ని మానవ విధ్వంసానికి ఉపయోగించే సరికొత్త మానవత్వ విద్రోహం.

### వైద్య ప్రతిజ్ఞకు ద్రోహం.. రిసిన్ కుట్ర!

హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ ఉదంతం వెన్నులో వణుకు పుట్టిస్తుంది. ప్రాణాలను నిలబెట్టాల్సిన వైద్యుడు.. ప్రాణాలు తీసేందుకు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన జీవ విషాలలో ఒకటైన 'రిసిన్'ను ఆముదం గింజల నుంచి తయారు చేయడం, దాన్ని ఢిల్లీ, లక్నో వంటి నగరాల్లో సామూహిక విషప్రయోగానికి సిద్ధం చేయడం చరిత్రలోనే ఎన్నడూ లేని దారుణం. కత్తులు, తుపాకులతో కాకుండా, అత్యంత రహస్యంగా, ఎవరూ ఊహించని విధంగా, శాస్త్రీయ పద్ధతిలో విధ్వంసం సృష్టించే కుట్ర ఇది. పైగా ఈ విషం ఎటువంటి రుచి, వాసన లేకుండా ఉంటుంది. ఈ విష ప్రయోగం అమలు అయితే.. జరిగే దారుణం తలుచుకుంటుంటేనే వెన్నులో వణుకుపుడుతుంది. ఈ చర్య వైద్య వృత్తికే తలవంపులు తెచ్చింది.

### సూట్లు, కోట్లు ధరించిన ఉగ్రవాదులు: శ్వేత వస్త్రాల మాడ్యూల్

గుజరాత్ ఏటీఎస్ ఛేదించిన కేసు ఒక ఎత్తైతే, ఢిల్లీకి సమీపంలోని ఫరీదాబాద్‌లో జమ్మూ & కశ్మీర్ పోలీసులు వెలికితీసిన ఉగ్రమాడ్యూల్ మరో భయంకర పార్శ్వం. ఈ కేసులో డాక్టర్ ముజమ్మిల్ గనాయీ, డాక్టర్ అదిల్ అహ్మద్ రాథర్ వంటి వైద్యులతో పాటు, మాస్టర్‌మైండ్ ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ అరెస్ట్ అయ్యారు. ఢిల్లీ, యూపీ, గుజరాత్‌లలో భారీ దాడులకు కుట్ర పన్నిన ఈ మాడ్యూల్ నుంచి 2,900 కేజీల భారీ పేలుడు పదార్థాలు పట్టుబడ్డాయి. ఈ మెటీరియల్‌ను పాకిస్థాన్ నుంచి డ్రోన్లు, స్మగ్లర్ల ద్వారా తెప్పించారు. ఉగ్రవాదం ఇప్పుడు నిరక్షరాస్యుల నుంచి కాదు, మనలోని అత్యంత ప్రతిభావంతులుగా, విద్యావంతులుగా చలామణి అవుతున్న వృత్తి నిపుణుల ద్వారా నడుస్తోంది. ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ వైద్యులకు మతోన్మాదం నూరిపోసి ఉగ్రవాదులుగా తయారు చేస్తున్నట్టు వెల్లడయ్యింది. టెలిగ్రామ్ ద్వారా ఐఈడీల తయారీ, ఆత్మాహుతి దాడుల సూచనలను అందించాడు. ఈ "శ్వేత వస్త్రాల టెర్రర్ ఎకోసిస్టమ్" దేశ భద్రతకు పెనుసవాలుగా మారింది.

### కొత్త ప్రమాదం: మహిళా ఉగ్రవాద విభాగం!

ఈ కుట్రలోని అత్యంత ఆందోళన కలిగించే అంశం లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ షాహిద్ అరెస్ట్. ఆమె కారు నుంచే ఏకంగా AK-47 రైఫిల్ పట్టుబడటం, దర్యాప్తులో ఆమె దేశవ్యాప్తంగా రెండేళ్ళ నుంచి దాడులకు సన్నద్ధమవుతున్నట్లు అంగీకరించడం గమనార్హం. పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మొహమ్మద్(JeM) సంస్థ కోసం, ఆమె లాజిస్టిక్స్, ఆశ్రయం, ఆర్థిక అవసరాలను చూసుకుంటూ, విదేశీ హ్యాండ్లర్ల నుంచి నిధులు, సూచనలు అందుకున్నట్లు వెల్లడైంది. ఉగ్రవాద సంస్థలు ఇప్పుడు తమ దాడుల కోసం, లాజిస్టిక్స్ కోసం, అత్యంత తెలివైన, విద్యావంతులైన మహిళలను రిక్రూట్ చేస్తున్నాయనడానికి డాక్టర్ షాహీన్ ఉదంతం తిరుగులేని సాక్ష్యం.

ఈ ఉగ్రకుట్రలన్నింటికీ మూల కారణం ఒకటే. ఆన్‌లైన్ రాడికలైజేషన్. టెలిగ్రామ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ మాధ్యమాల్లో కూర్చుని, విదేశీ హ్యాండ్లర్లు మన యువత మెదళ్లను విషపూరితం చేస్తున్నారు. మన నిఘా సంస్థలైన ఏటీఎస్ ఎన్ఐఏ, పోలీసు దళాలు నిశ్శబ్దంగా వేల ప్రాణాలను కాపాడుతున్నాయి. గుజరాత్ ఏటీఎస్ గనుక ఆ 'రిసిన్ ప్లాన్'ను అడ్డుకోకపోతే, ప్రాణ నష్టం వంద రెట్లు ఉండేది. ఈ మౌనవీరుల కృషి అమోఘం. ఉగ్రవాదం తన రూపం మార్చుకున్నప్పుడు, దానిని ఎదుర్కొనే మన విధానాలు కూడా మారాలి. ఈ దుష్టశక్తులను మూలాల నుంచి పెకిలించి వేయడానికి కేంద్ర, రాష్ట్ర సంస్థలు సమన్వయంతో, ప్రజల సహకారంతో కృషి చేయాలి.

ఈ సరికొత్త ఉగ్రపిశాచాన్ని అడ్డుకోవడంలో తల్లిదండ్రులు విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని తాజా ఉదంతాలు నొక్కి చెబుతున్నాయి.

పిల్లలు, విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఎవరితో మాట్లాడుతున్నారు, ఎలాంటి మౌఢ్యానికి ప్రభావితమవుతున్నారో గమనించాలి. యువతలో దేశభక్తి, మానవత్వం విలువలను పెంచడమే మనం ఈ ఉగ్ర భూతానికి ఇవ్వగలిగే అసలైన సమాధానం. ఉగ్రవాదం తన ముఖచిత్రాన్ని మార్చుకుంటున్న ఈ క్లిష్ట సమయంలో, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలి. జ్ఞానం అనేది మానవాళికి ఉపయోగపడాలి, విధ్వంసానికి కాదు.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్




## చేనేత కార్మికుల ధర్నాందోళన

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలు తీర్చాలంటూ చేనేత కార్మికులు ఇటీవల నెల్లూరులోని చేనేత అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాందోళన చేశారు. తాము అధికారంలోకి వస్తే నేతన్నల కష్టాలన్నీ తీర్చేస్తామని టీడీపీ నేతలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేశారని, తీరా అధికారంలోకి వచ్చాక తమ బాధలు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన జీఎస్టీని వెంటనే రద్దుచేయాలని వారు కోరారు. రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు రావాల్సిన సుమారు 127 కోట్ల రూపాయలను వడ్డీతో సహా విడుదల చేయాలన్నారు.మొంథా తుఫాన్ దెబ్బకి విలవిలలాడుతున్న చేనేతల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాందోళనలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పముజుల హరి, జిల్లా చేనేత నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, పడవల సుబ్రహ్మణ్యం, ఎం.రాంబాబు, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా సంఘం అధ్యక్షులు బుధవారపు బాలాజీ, సోమా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల నిరసన

ముత్తుకూరురోడ్డు వద్ద ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టమ్ (ఏటీఎస్)లో దళారులదే రాజ్యంగా తయారైందని, వెంటనే దానిని రద్దు చేయాలని ఆందోళన చేస్తూ నెల్లూరులోని ఆటోకార్మికులు రోడ్డెక్కి నినాదాలు చేశారు. ఏటీఎస్ తీరును నిరసిస్తూ ఆ సెంటర్ ఎదుట నినాదాలు చేశారు. సీఐటీయు అనుబంధ సంఘంగా ఉన్న ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ 24 గంటల నిరసనలో జిల్లా సీఐటీయు అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలోని దూరప్రాంతాల నుంచి ఆటోలవారు తమ ఆటోలతో ఇక్కడికొచ్చి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలంటే ఎంతో ఇబ్బందిగా ఉందన్నారు. ఆటో కార్మికులకు దీనివల్ల అదనపు భారం పడుతోందని, ఇదే అదునుగా దళారులు రంగప్రవేశం చేసి, ముడుపులు తీసుకుని ఆటో కార్మికులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఈ ఫిట్‌నెస్ కేంద్రాలను ప్రైవేటు రంగంలోని ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల మధ్యవర్తులైన దళారుల దోపిడీ యదేచ్ఛగా జరిగిపోతోందని వారు విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం ఈ దోపిడీని నిలువరించి ఆటోకార్మికులకు న్యాయం చేయాలన్నారు. ముత్తుకూరు సమీపంలో ఉన్న ఏటీఎస్ సెంటర్‌ను సత్వరం రద్దుచేసి, ప్రభుత్వ అధికారుల నిర్వహణలోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేలా చూడాలని ఆటోకార్మిక సంఘం నాయకులు సురేష్ విజ్ఞప్తి చేశారు.

## నెల్లూరు రూరల్‌లో వైసీపీ ఆందోళన

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ యత్నం దారుణమంటూ నెల్లూరురూరల్‌లో వైసీపీ నాయకులు ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ప్రజాఉద్యమం నిర్వహించి, ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు. కొమ్మరపూడి, ములుమూడి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ తీరును తెలియజేశారు.

## మంచినీటి కోసం..
## రోడ్డెక్కిన చౌకిచర్ల గిరిజనులు

తమ ఊళ్లో మంచినీటి వసతి కోసం ఉన్న మోటారు బోర్లు చెడిపోయాయని, దీంతో మంచినీటి కోసం నిత్యం అవస్థలు పడుతున్నామంటూ విడవలూరు మండలం చౌకిచర్ల గ్రామంలోని గిరిజనులు ఈనెల 8న ఖాళీబిందెలతో ఆందోళన చేశారు. తమ సమస్యను పంచాయతీ సిబ్బందికి తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గిరిజనకాలనీలో 24 కుటుంబాలున్నాయని, ప్రస్తుతానికి తాము స్థానిక టీడీపీ నాయకుని ఇంటివద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని, ఇకనైనా పంచాయతీ అధికారులు బోరు మరమ్మతులు చేసి తమ గ్రామానికి మంచి నీరు ఇబ్బంది లేకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నీటి సంరక్షణలో.. జిల్లాకి అవార్డు

## రాష్ట్రపతి చేతులమీదుగా అందుకోనున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నీటి సంరక్షణ కార్యక్రమాల్లో నెల్లూరుజిల్లా అగ్రగామిగా ఉంది. నవంబరు 18న ఢిల్లీలో నిర్వహించనున్న అవార్డుల ప్రదానోత్సవంలో, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన 'జల్ సంచయ్ జన్ భగీదారి 1.0' అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ గంగాభవాని ఈనెల 11న కలెక్టర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ వివరాలను ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 856 ఫారం పాండ్లు, ఇంకుడుగుంటలు 3495, ఊట చెరువులు 112, చెక్‌డ్యాములు 166, డగ్గౌట్‌పాండ్లు 512 నిర్మించడం జరిగిందన్నారు. ఇవేకాక, 54రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, 12 రింగ్‌ట్రెంచ్‌లు, 34 సరిహద్దు కందకాలు, 14 నీటినిల్వ కందకాలు, 247 చెరువులు పూడికతీత పనులు మొత్తం 5502 భూగర్భ జలాల నీటిమట్టం పెరిగే కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

# ఉప్పొంగిన దేశభక్తి




'వందేమాతరం' గేయానికి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌడంగవే ఆదేశాలతో, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో వెంగళరావునగర్‌లోని కార్పొరేషన్ స్కూల్‌లో ఇటీవల సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లలో దేశభక్తి ఉప్పొంగింది. 'వందేమాతరం' గేయాన్ని అద్భుతంగా ఆలపించారు. అనంతరం నరేంద్రబాబు మాట్లాడుతూ, 1875 నవంబర్ 7న బెంగాల్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ కవి బంకిమ్‌చంద్ర ఛటర్జీ రచించిన "వందేమాతరం" జాతీయ గేయం స్వాతంత్ర్య సమరంలో భారతీయులందరినీ ఏకతాటిపై నిలిపిందని తెలిపారు. 1950 జనవరి 24న ఆ గేయాన్ని జాతీయ గేయంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జాతీయగీతం రచించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మొట్టమొదటిసారిగా వందేమాతర గేయాన్ని ఆలపించారని వివరించారు. ప్రధానోపాధ్యాయిని సి.మంజులవాణి, ఎన్‌సిసి పిఐ స్టాఫ్ అనురాగ్, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# సోమశిలకి జలకళ!

ఇటీవల కురిసిన భారీవర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో వచ్చిన కుండపోత వానలతో జిల్లాలోని చెరువులు దొరువులన్నీ పూర్తిగా నిండిపోయాయి. అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయానికి నేటికీ ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటి ప్రవాహం వస్తూనే ఉండడంతో సోమశిల డ్యామ్ నిండా నీటి ప్రవాహం కనిపిస్తోంది. ఈ నెల 11వ తేదీ సాయంత్రానికి ఈ జలాశయానికి 9848.87 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. జలాశయం పూర్తి నీటినిల్వ సామర్థ్యం 78 టీఎంసీలైతే, మంగళవారానికి 71.747 టీఎంసీల నీటి నిల్వతో సోమశిల డ్యామ్ కళకళలాడుతోంది. దీంతో దిగువ ప్రాంతాలైన పెన్నా డెల్టాకి నీటిని విడుదల చేస్తున్నారు.

### పశువైద్యాధికారులకు

# ఉద్యోగోన్నతితో బదిలీలు

నెల్లూరుజిల్లాలో పనిచేస్తున్న పలువురు పశువైద్యాధికారులకు ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులు జరిగాయి. దుత్తలూరులో పనిచేస్తున్న డాక్టర్ జి.ప్రసన్నాంజనేయరెడ్డిని చిత్తూరుకు బదిలీ చేశారు. మర్రిపాడులో ఉన్న డాక్టర్ జయచంద్రను ఒంగోలుకు, రాపూరు డాక్టర్ అనిల్‌కుమార్‌ను తిరుపతికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ ముగ్గురికీ డిప్యూటీ డైరెక్టర్లుగా ఉద్యోగోన్నతులు కూడా కల్పించింది. అదే విధంగా, ఇందుకూరుపేటలో ఉన్న డాక్టర్ బి.మురళీకృష్ణను ఒంగోలు డీఎల్‌డీఓగా బదిలీ చేశారు.




### రామ్‌కుమార్ ఆధ్వర్యంలో..

# వెంకటగిరిలో భారీ ర్యాలీ

రాష్ట్రంలో వైద్య కాలేజీల ప్రైవేటీకరణ యత్నాలపై నిరసనగా ఈనెల 12న వెంకటగిరిలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీల్లో పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. నేదురుమల్లి నివాసం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీగా ర్యాలీ చేపట్టి ప్రభుత్వ విధానాలను నిరసించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత డా. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టామని, జగన్ పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ.. ప్రజా ఉద్యమ కార్యక్రమంలో పాల్గొని, ప్రభుత్వం చేస్తున్న నిర్వాకాలను ప్రజలకు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా రామ్‌కుమార్ తెలిపారు. వైసీపీ చేపట్టిన ఈ ప్రజా ఉద్యమానికి.. ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేసిన పార్టీ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# సీనియర్ న్యాయవాది..విజయం కన్నుమూత

నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాది పి.ఇ విజయం ఈనెల 11న కన్నుమూశారు. ఆయన మరణానికి నగరంలోని న్యాయవాదులు సంతాపం తెలిపారు. నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అయ్యప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.నాగరాజు, బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కుడుముల రవికుమార్, వెంకయ్య, రామకృష్ణప్రసాద్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే పాశిం




గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు పంచాయతీలో ఏపిఐఐసి ఆధ్వర్యంలో 48 ఎకరాల్లో ఎమ్ఎస్ఎమ్ఈ పార్కుకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఇటీవల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు నిర్మాణం కోసం తొలి విడతగా 20 ఎకరాల్లో 9 కోట్ల 65 లక్షల రూపాయలతో పనులు జరుగుతాయని, మొత్తం ప్రాజెక్టు విలువ 129 కోట్ల రూపాయలని తెలిపారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్న ఉద్దేశంతో సూక్ష్మ చిన్న మధ్యతరగతి పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. గతంలో ఏపీఐఐసి భూములలో అక్రమంగా గ్రావెల్, సిలికా తవ్వకాలు జరిగాయని, ప్రస్తుతం ఆ భూముల్లో క్రిష్ సిటీకి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గూడూరును నెల్లూరుజిల్లాలో కలిపేందుకు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చిన కలెక్టర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

# యూనివర్సిటీ టాపర్‌గా పాశం జస్వంత్



పాండిచ్చేరిలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో వైద్య విద్య అభ్యసిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కుమారుడు పాశం జస్వంత్‌కుమార్ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి, గోల్డ్‌మెడల్ అందుకుని గూడూరు ఖ్యాతిని ఇనుమడింపజేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, పాశం సునీల్‌కుమార్ అభిమానులు జస్వంత్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# డప్పు కళాకారులను ఆదుకోవాలి

### సంక్రాంతి వెంకటయ్య



డప్పు కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని, లేని సందర్భంలో భవిష్యత్తులో డప్పు కళ పూర్తిగా అంతరించిపోతుందని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం నాయకులు సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల గూడూరు పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం గూడూరు మహాసభ నిర్వహించారు. డప్పు వాయిద్య గొప్పతనాన్ని తెలియజేస్తూ గీతాలను ఆలపించారు. సంఘ నాయకులు సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ ఇప్పుడు సినిమా ఆధునిక వాయిద్యాలను ప్రోత్సహిస్తోందని, దీంతో డప్పు కళ అంతరించిపోయే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. డప్పు వాయించే వాళ్లందరికీ భూములు ఇప్పించేలా సంఘం ప్రయత్నిస్తుందని వెల్లడించారు. అనంతరం సి.పి.ఎం కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డప్పులు వాయిస్తూ ర్యాలీ చేపట్టి, వినతిపత్రం అందచేశారు. సమావేశంలో కె.వి.పి.ఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, పుల్లయ్య రఘు, నారాయణ, క్రాంతి, గంగిరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### డప్పు కళాకారుల నూతన కమిటీ

ఈ సందర్భంగా ఏపీ డప్పు కళాకారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చనుమూరు క్రాంతి, ఉపాధ్యక్షులుగా అడపాల ప్రసాద్, బద్దేపూడి కృష్ణ, కార్యదర్శిగా రాగిపాటి నారాయణ, సహాయ కార్యదర్శిగా ఎంబేటి చంద్రయ్య, కనుపూరు ముత్యాలయ్య, ట్రెజరర్‌గా యేకుల రమణయ్య, కమిటీ సభ్యులు 15 మందిని ఎన్నుకున్నారు. అనంతరం పలువురు నాయకులు కొత్త కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.




# ఢిల్లీ పేలుళ్లతో.. గూడూరులో తనిఖీలు


దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడుతో దేశమంతా ఉలిక్కిపడింది. 13ఏళ్ల తర్వాత ఢిల్లీని పేలుళ్లు వణికించాయి. దీంతో, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు గూడూరు డీఎస్పీ గీతాకుమారి సూచనతో గూడూరు రూరల్ పరిధిలోని జాతీయ రహదారి ప్రధాన రోడ్డు మార్గాలు, ముఖ్యమైన కూడళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తూ.. ట్రాఫిక్ నియమాలపై రూరల్ ఎస్.ఐ తిరుపతయ్య అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని పార్సిల్ కార్యాలయం, పలు రద్దీ ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

# గర్భిణీ స్త్రీలకి జేవీవీ భోజనాలు



గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిరుపేద గర్భిణీ స్త్రీలకి భోజనాలు పంపిణీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ చెంచులక్ష్మి చేతులమీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.

# కళ్యాణ వైభోగం...!




డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ అల్లూరు చంద్రశేఖర్‌రెడ్డి - ఉజ్వల కుమార్తె **గ్రీష్మ సాయి - కనిష్క్‌రెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు కోకు రాజేంద్రప్రసాద్‌రెడ్డి - శారదల కుమారుడు)ల వివాహం నవంబర్ 7వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకి 'లాయర్' శుభదీవెనెలు.

# రామదాసుకండ్రిగలో.. ఎంఎస్‌ఎంఇ పార్కు

## • వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి



ఎట్టకేలకు నెల్లూరుజిల్లాకి ఎంఎస్‌ఎంఇ పార్కు మంజూరైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ పార్కుకు ఇటీవల వర్చువల్‌గా శంకు స్థాపన కూడా చేశారు. నెల్లూరు కలెక్ట రేట్‌లో ఆన్‌లైన్‌లో జరిగిన ఈ కార్యక్ర మంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ కళ్యాణ చక్రవర్తి, ఏపీఐఐసీ అధికారులతో కలిసి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగ ప్రాంతంలో 57ఎకరాల పార్కుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. సుమారు 5.50 కోట్లు ఖర్చుపెట్టి తొలిదశలో 28 ఎకరాల్లో వసతులు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన స్థలాలకు జిల్లాలో కొదవ లేదన్నారు. వెంకటాచలం మండలం కంటేపల్లిలో 220 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, అదేవిధంగా, మనుబోలు మండలంలోని బండేపల్లి, మడమనూరు ప్రాంతంలోనూ 150 ఎకరాల భూములు పరిశ్రమల ఏర్పాటుకు అనువైనవి ఉన్నాయని చెప్పారు. జాతీయ రహదారులు, సాగరమాల రోడ్లు, రైలుమార్గంతో పాటు చెన్నై, రేణిగుంట, తిరుపతి ఏర్పాటు కానున్న దగదర్తి ఎయిర్ పోర్టు వగైరాలు జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించనున్నాయని తెలిపారు. ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నం పోర్టు పక్కనే రిలయన్స్ సంస్థ తీసుకున్న 2600 ఎకరాల భూమి ఖాళీగా ఉందన్నారు. 2009లో అనిల్ అంబానీ ఎకరా రూ.7.75 లక్షల లెక్కన తీసుకున్న భూములు అప్పటినుంచి నిరుపయోగంగానే ఉన్నాయని, వ్యవసాయ కార్యకలాపాలు లేకపోవడంతో రైతు కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని వినియోగించి పరిశ్రమల స్థాపనకు కృషిచేయాలని ముఖ్యమంత్రిని కోరుతామని చెప్పారు.

# శ్రీసిటీలో.. జర్మనీ వాణిజ్య ప్రతినిధులు



జర్మనీలోని సాక్సోనీ రాష్ట్రానికి చెందిన 18 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం ఈనెల 11న శ్రీసిటీని సందర్శించింది. ఆ రాష్ట్ర వాణిజ్య, కార్మిక, ఇంధన, వాతావరణ శాఖ మంత్రి డిర్క్ పాంటర్ నేతృత్వంలో పర్యటనకు విచ్చేసిన ప్రతినిధులకు శ్రీసిటీ చైర్మన్ శ్రీని రాజు, వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రగతిని డాక్టర్ సన్నారెడ్డి వివరించారు. 31 దేశాలకు చెందిన 240కి పైగా ప్రముఖ కంపెనీలకు నిలయమైన శ్రీసిటీలో జర్మనీకి చెందిన బెల్ ఫ్లేవర్స్ మరియు ఫ్రాగ్రెన్సెస్, క్నాఫ్, కాంక్యో బర్గ్ పరిశ్రమలు సైతం ఉన్నాయని వారి దృష్టికి తెచ్చారు. పారిశ్రామికవేత్త లకు భారత ప్రభుత్వం అందిస్తున్న పన్ను మినహాయింపులు, సబ్సిడీలు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం, మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. అనంతరం, శ్రీసిటీలో పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అనుకూలతలపై ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రణాళిక, మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అనుకూల విధానాలను ప్రశంసించిన పాంటర్, భవిష్యత్తులో మరిన్ని జర్మన్ సంస్థలు ఇక్కడ కంపెనీలు నెలకొల్పడానికి ఆసక్తి చూపుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ తర్వాత, ప్రతినిధి బృందం స్థానిక బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ పరిశ్రమను సందర్శించింది.

# సాఫ్ట్‌వేర్ రంగంలో మరో సంచలనం

## • నెల్లూరు కేంద్రంగా 'బ్లేజ్‌అప్' ఆవిష్కరణ



సాఫ్ట్‌వేర్ అనేది మెట్రోపాలిటన్ నగరాలకే కాదు, చిన్నస్థాయి నగరాలకు సైతం విస్తరించాలనే సంకల్పంతో నెలకొల్పిన సాఫ్ట్‌వేర్ సంస్థ 'టెర్రాలాజిక్'. నెల్లూరుకు చెందిన రెనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సంస్థ అమెరికా, ఇండియాలో విస్తృత సేవలందిస్తోంది. బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లోనే కాదు, నెల్లూరు వంటి నగరాలకు సైతం సాఫ్ట్‌వేర్ రంగాన్ని తీసుకురావాలనే సంకల్పంతో ఆయన కొన్నేళ్ళ క్రితమే తన మాతృభూమి నెల్లూరు నగరంలో సొంతంగా 'టెర్రాలాజిక్'ను స్థాపించి వందలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ఈ నేపథ్యంలో మినీబెపోలిస్‌లోని 'బ్లేజ్‌అప్' కార్యాలయంలో ఈ నెల 9న ఆయన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికగా ఆంధ్రప్రదేశ్‌కే తలమానికంగా నెల్లూరు కేంద్రంగా 'బ్లేజ్‌అప్' అనే యాప్‌ని ఆవిష్కరించడం విశేషం! అన్ని ఎంటర్‌ప్రైజ్ ఆపరేషన్స్‌కు ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్లాట్‌ఫాం 'బ్లేజ్‌అప్' అని ఆయన తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో వరల్డ్‌క్లాస్ ప్రోడక్ట్ తయారు చేయడానికి అమెరికాలోని సిలికాన్ వ్యాలీ, ఇండియాలోని మెట్రోసిటీలలో ఉండాల్సిన అవసరం లేదని, సరైన టీమ్, సరైన విజన్ ఉంటే ఎక్కడనుంచైనా ప్రోడక్ట్ లాంచ్ చేయవచ్చని చాటిచెప్పడమే తన ఉద్దేశ్యమన్నారు. 'బ్లేజ్‌అప్' ఆవిష్కరణ ద్వితీయశ్రేణి నగరాలలో సాఫ్ట్‌వేర్ రంగానికి పెద్ద మలుపని, కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానికంగా యువతతో నైపుణ్యాలను పెంచుకోవడానికి దోహదపడుతుందని రెనిల్‌కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రెనిల్‌కుమార్‌రెడ్డి కార్యదక్షతను ప్రోత్సహించే క్రమంలో అమెరికాలోని ప్రముఖ వ్యాపార దిగ్గజం బ్రిజన్ హోల్డర్ ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టడం మరో విశేషం!

# అతివేగం..ముగ్గురిని మింగేసింది

## • ఎన్టీఆర్ నగర్ వద్ద ఘోరం • మృతుల్లో.. సచివాలయ ఉద్యోగి





***అతివేగం మరో ముగ్గురిని మింగేసింది. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఈనెల 11న జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువుకి బలిపోయారు. రోడ్డుపై వేగంగా వస్తున్న ఓ కంటైనర్ అదుపుతప్పి, రోడ్డు దాటుతున్న ఓ బైకర్‌ని ఢీకొట్టింది. అయినా వేగాన్ని అదుపు చేసుకోలేక, సమీపంలోనే ఉన్న మరో రెండు బైక్‌లను కూడా ఢీకొడుతూ వెళ్ళి, రోడ్డుపక్కన ఉన్న చిరువ్యాపారులపైకి దూసుకువెళ్ళడంతో ఆ ప్రాంతమంతా భీభత్సంగా మారింది. అక్కడే ఉన్న ఓ చెట్టునీ ఢీకొట్టి కంటైనర్ ఆగిపోయింది. అతివేగం ఎంత అనర్థదాయకమో.. చూస్తుండగానే ముగ్గురి ప్రాణాలు హరీమన్నాయి. కన్ను మూసి తెరిచే లోగా ప్రమాదం జరిగిపోయింది.***

నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ వద్ద రోడ్డుప్రమాదం పలు కుటుంబా లను శోకసాగరంలో ముంచివేసింది. ప్రమాద దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం సిరి గార్డెన్స్‌కి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏ.సురేష్(35), బైక్‌పై వెళ్తున్న తండ్రీ కొడుకులు.. వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ఖాజా నజీం మొహిద్దీన్ (70), ఆయన కుమారుడు.. సచివాలయ ఉద్యోగి షేక్ ముజాహిద్ అలీ (35) అక్కడికక్కడే మృతిచెందడం స్థానికులను కంటతడిపెట్టించింది. తమ తండ్రిని నజీమ్ మొహిద్దీన్‌ను వైద్యచికిత్సల కోసం ఆసుపత్రికి తీసుకువెళ్ళి తిరిగివస్తుండగా, ఆ తనయుడిని.. తండ్రిని కూడా మృత్యురాకాసి పొట్టన పెట్టుకుంది. దీంతో వారి కుటుంబం కన్నీరు మున్నీరైంది. ఈ ఘటనలో మృతిచెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి సురేష్‌కి భార్య ఉంది. ఆమె నిండుగర్భిణి కూడా. ఇంటికి వస్తూ ఆమెకి కొబ్బరి నీళ్ల తీసుకోవడం కోసం ఆయన వెళుతుండగా ఈ ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయాడు. భర్త దారిలో మరణించాడనే సమాచారం తెలిసిన వెంటనే ఆ భార్య ఇంట్లోనే కుప్పకూలిపోయింది. ఈ ప్రమాద ఘటనతో ఎన్టీఆర్‌నగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికుల సమా చారంతో పోలీసులు హుటాహుటిన వచ్చి బాధితులను ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ప్రమాద ఘటనా ప్రాంతాన్ని



పరిశీలించారు. ప్రమాద బాధితులను మంత్రి నారాయణ ఆసుపత్రిలో పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు.

### మరికొందరికి గాయాలు :

ఈ ప్రమాదంలో రోడ్డుపక్కన మొక్కజొన్న కండెలు అమ్ముకునే మంజుల, కొబ్బరికాయలు అమ్ముకుంటున్న మాలకొండయ్య, లైన్‌మెన్ ఈదూరు అనిల్, మరోవ్యక్తి.. గ్రీన్‌సిటీలో వాచ్‌మెన్‌గా ఉన్న కోటేశ్వరరావు లకు గాయాలయ్యాయి. అతివేగంతో కంటైనర్‌ని నడిపిన డ్రైవర్‌కి కూడా దెబ్బలు తగిలాయి. ఆయన బీహార్‌కి చెందిన వ్యక్తిగా సమాచారం. ఘటన విషయం తెలిసిన వెంటనే మృతుల కుటుంబాలకు చెందిన వారు ఆసుపత్రికి చేరుకుని, తమవారి మృతదేహాలను చూసి పెద్దగా రోదించారు. బాధిత కుటుంబసభ్యుల వేదనారోదనలతో ఆసుపత్రి ప్రాంగణం శోకమయమైంది.

# జిల్లా రైతాంగానికి.. 15 నుంచి సాగునీరు

ఐఏబీ నిర్ణయం




జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి రైతులకు ఈనెల 15వ తేదీ నుంచి సాగునీటిని విడుదల చేసేందుకు నెల్లూరు జడ్పీ సమావేశమందిరంలో ఇటీవల జరిగిన ఐఏబి (జిల్లా సాగునీటి సలహామండలి)లో నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షత్వంలో ఇటీవల జరిగిన ఆ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ, సోమశిల జలాశయం పరిధిలోని పెన్నార్‌డెల్టా, కనుపూరు కాలువ, కావలి కాలువ, జికెఎస్ కాలువ, దక్షిణకాలువలకు, కండలేరు జలాశయం పరిధిలోని తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా కెఆర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్, యస్‌యస్‌జి కెనాల్ (నెల్లూరు,తిరుపతి)కు సాగునీటి, తాగునీటి అవసరాల కోసం ఈనెల 15వ తేదీ నుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులని ఆదేశించామని చెప్పారు. ఏ ఒక్క రైతుకు కూడా ఇబ్బందులు లేకుండా సాగునీటి కేటాయింపులు జరిపినట్లు చెప్పారు. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, డీవీ కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, తూమాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వ్యవసాయ, తాగు నీటి అవసరాలకు కేటాయించాల్సిన నీటి కేటాయింపులపై ఈ సమావేశంలో మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. రైతు సంఘాల నాయకులు, ప్రాజెక్టు కమిటీల సభ్యులందరి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జిల్లాలోని జలాశయాలు, చెరువులు, పంట కాలువల్లో పుష్కలంగా నీరు వుందని, సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. జిల్లాలో 2025–2026 ఖరీఫ్ సాగుకు సంబంధించి సుమారు 5లక్షల ఎకరాలకు 50టిఎంసీల నీటిని విడుదల చేసేందుకు, కండలేరు జలాశయం నుంచి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా 2,23,333 ఎకరాలకు 22.333 టిఎంసీల నీటిని.. మొత్తం సుమారు 7.30 లక్షల ఎకరాలకు 73టిఎంసీల నీటి కేటాయింపులు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, ఆ మేరకు నీటి కేటాయింపులకు ఐఎబి సమావేశం ఆమోదించినట్లు ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ తెలిపారు.

# పెరుగు రామకృష్ణకి.. సార్క్ సాహితీ పురస్కారం

న్యూఢిల్లీలోని ఫౌండేషన్ ఆఫ్ సార్క్ రైటర్స్ అండ్ లిటరేచర్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సార్క్ సాహిత్య వార్డుల కార్యక్రమంలో నెల్లూరుకి చెందిన కవి పెరుగు రామకృష్ణకి సార్క్ అవార్డు లభించింది. సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ మాధవ్ కౌశిక్, శ్రీలంక హైకమిషనర్‌ల చేతులమీదుగా ఆయన ఆ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సార్క్ రచయితలు ఆయన్ను అభినందించారు. కవి పెరుగు రామకృష్ణ ఇప్పటికే పలు పుస్తకాలు రచించారు. ఎన్నో అవార్డులు కూడా అందుకున్నారు. వారి సాహితీ సేవలకు గుర్తింపుగా ఈ అంతర్జాతీయస్థాయి పురస్కారం లభించడం విశేషం.



# బాలల మామయ్య.. నెహ్రూజీ



*నవంబర్ 14... 'బాలల దినోత్సవం' అని అందరికీ తెలిసిందే! ఆరోజు చాచా నెహ్రూ పుట్టిన రోజు. పిల్లలన్నా, గులాబీలన్నా నెహ్రూకెంతో యిష్టం. "పిల్లలతో ఆడుతున్నంత సేపు నేను ముసలి వాడినన్న సంగతి మరిచిపోతాను. పిల్లలందరూ ఒకచోట చేరితే, ఆడుకుంటారు. పోట్లాడుకుంటారు. ఆ పోట్లాటా ఒక ఆటలాగే వుంటుంది. ఆ తర్వాత ఎలాంటి తేడాలు, తారతమ్యాలు లేక హాయిగా కలిసిపోతారు." – అనేవారు నెహ్రూజీ పిల్లల గురించి చెపుతూ.*

పిల్లలు ఆరోగ్యకరమైన, ప్రశాంత వాతావరణంలో సుఖ, సంతోషాలతో జీవించాలని నెహ్రూ కోరుకునేవారు. కలలు కనేవారు. తనకున్న తీరికలేని పనుల్లో సైతం ఆయన కాస్త వ్యవధి చూసుకుని పిల్లలతో గడిపేవారు. అందుకే ఆయన పుట్టినరోజును 'బాలల దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

స్వాతంత్ర్యం వచ్చాక నెహ్రూ ఒక పాఠశాలలో ఒక కార్యక్రమానికి వెళ్లారు. ఒక చిన్న అమ్మాయి ప్రేమతోను, భయం భయంగాను నెహ్రూను సమీపించి ఒక గులాబీ పువ్వునిచ్చింది. "ఇది ఎవరి కోసం అమ్మా!" అని నెహ్రూ అడిగారు. "మీ కోసమే తాతయ్యా! మీరు ఎప్పుడూ నవ్వుతూ వుంటారు కదా! మీ దగ్గర ఈ పువ్వు ఉంటే ఇంకా మీరు అందంగా నవ్వుతారు!" అంది ఆ అమ్మాయి. దానికి నెహ్రూ "ఇక నుంచి నేను గులాబీ పువ్వును ఎప్పుడూ నాతో ఉంచుకుంటాను. ఎందుకంటే నా గులాబీలు – మీరే పిల్లలు" అన్నారు. ఆ విధంగా నెహ్రూ గారి కోటుపై గులాబీ పువ్వు శాశ్వతమైంది. ఆయన జన్మదినం 'బాలల దినోత్సవం' అయింది.

మోతీలాల్, స్వరూపరాణి దంపతులకు 1889వ సంవత్సరం, నవంబర్ 14న అలహాబాద్‌లో నెహ్రూ జన్మించారు. ఆయన పూర్తిపేరు జవహర్‌లాల్ నెహ్రూ. జవహర్ అంటే ఆభరణం. నెహ్రూ అంటే కాలవ గట్టు. వారి పూర్వీకులు కాశ్మీరీలు. వారు అక్కడ ఒక కాలువ గట్టు దగ్గర నివసించడం వల్ల వారికి ఆ ఇంటిపేరు వచ్చింది.

1905లో కేంబ్రిడ్జిలోని ట్రినిటి కళాశాలలో చేరిన నెహ్రూ 1910లో న్యాయశాస్త్ర పట్టా పొందారు. 1912లో అలహాబాద్ హైకోర్టులో న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆయన భార్య పేరు కమలాకౌల్. కుమార్తె ఇందిరా ప్రియదర్శిని.

బంకిపూర్‌లో మొదటిసారి కాంగ్రెస్ మహాసభలో పాల్గొన్నారు. రాజకీయ జీవితానికదే నాంది. డిసెంబర్‌లో లక్నో కాంగ్రెస్‌లో మొదటిసారిగా గాంధీజీని కలుసుకున్నారు.

తండ్రి మోతీలాల్, గాంధీజీ, రవీంద్రుడు మొదలైనవారి ప్రభావం నెహ్రూ మీద ఎంతో ఉంది. తండ్రి నుంచి అభ్యుదయభావాలు నేర్చుకున్నారు. గాంధీజీ నుండి సత్యం, శాంతిలను అందుకున్నారు. రవీంద్రుని నుండి సాహితీ సౌందర్యం, అంతర్జాతీయ దృక్పథాలను నేర్చుకున్నాడు. ఇవన్నీ భావిజీవితంలో ఆయనొక గొప్పనాయకుడిగా ఎదగడానికి దోహదపడ్డాయి.

తాను సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ విలాసవంతమైన జీవితం గడపక, దేశ స్వాతంత్ర్యం కోసం తొమ్మిదేళ్ళు కారాగారవాసం అనుభవించాడు. భార్యాబిడ్డలకు దూరమయ్యాడు. గాంధీజీ నాయకత్వంలో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాధికారానికి చరమగీతం పాడారు.

స్వాతంత్ర్యం వచ్చాక మొదటి ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, పదిహేడేళ్ల పాటు ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారు. వాటిని జయప్రదంగా నిర్వహించి, ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. అందులో ముఖ్యంగా రాజ్యాంగం అమలు, సంస్థానాల విలీనం, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, పంచశీల సిద్ధాంతాల ప్రచారం, పంచవర్ష ప్రణాళికల ప్రారంభం, సమాజాభివృద్ధి కార్యక్రమాలు, స్టీలు ఫ్యాక్టరీల నిర్మాణం, ఆనకట్టల నిర్మాణం, విజ్ఞానశాస్త్రాల అభివృద్ధి, అణుశక్తి వినియోగానికి ప్రోత్సాహం, అకాడమీల ఏర్పాటు లాంటి కార్యక్రమాలెన్నింటినో ప్రారంభించారు.

అలీన విధానం ద్వారా ప్రపంచమంతటా శాంతి పావురాన్ని ఎగురవేశారు. సాంఘీక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చే నూతన సంఘ నిర్మాణాన్ని కోరుకున్నాడు. అవిద్య, అజ్ఞానం, దారిద్ర్యం, దైన్యం తాండవిస్తున్న దేశాన్ని ఉద్ధరించడానికి విజ్ఞాన సాంకేతిక రంగాలే సాధనాలని ఆయన నమ్మాడు. నెహ్రూ ఆలోచనలు, కార్యదీక్ష, శక్తిసామర్థ్యాలు గొప్పవి. అందుకే ఆయన భారత చరిత్రలోనే గాక ప్రపంచ చరిత్రలో కూడా మహానాయకుడిగా గుర్తించబడ్డాడు. ఆయన ప్రపంచశాంతిని ప్రేమించాడు. మానవ నాగరికత సుస్థిరత్వానికి పాటుపడ్డాడు. మనిషి మనిషికి, జాతి జాతికి మధ్యగల అడ్డుగోడలను పడగొట్టడానికి కృషి చేశాడు. అందుకే ఆయన్ను మహాత్మాగాంధీ 'రత్నం లాంటివాడు' అని, బాబూ రాజేంద్రప్రసాద్ 'యుగపురుషుడు' అని, 'మానవజాతి సముద్ధారకుడు' అని సర్వేపల్లి రాధాకృష్ణన్‌లు కొనియాడారు.



**డా. గంగిశెట్టి శివకుమార్**
సెల్ : 94418 95343

## టూకీగా...



### కనుపూరులో క్యాన్సర్‌పై అవగాహన

వెంకటాచలం మండలంలోని కనుపూరు సచివాలయంలో ఇటీవల కసుమూరు వైద్యాధికారిణి డాక్టర్ ప్రణవి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. క్యాన్సర్ వచ్చిందని అనుమానం వస్తే వెంటనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

### జక్కపల్లిగూడూరులో..'పొలం పిలుస్తోంది'

బోగోలు మండలం జక్కపల్లిగూడూరులో ఈనెల 11న మండల వ్యవసాయాధికారిణి శైలజ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి రైతులకు పంటలసాగుపై సూచనలిచ్చారు. పంటలకు వచ్చే తెగుళ్ళను, చీడపీడలను ఎలా అదుపుచేయాలో వివరించారు. వ్యవసాయాధికారులు శ్రీవాణి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తాళ్ళపాళెంలో హెచ్ఐవీ బాధితులకు సరుకులు

కావలి మండలం తాళ్లపాళెం గ్రామపరిధిలో ఉన్న హెచ్ఐవీ సేవల కేంద్రంలో ఉన్న బాధితులకు పోషకాహారం అందించాలని, ఈనెల 11న అన్నం సుబ్బారావు సతీమణి సుగుణమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆ కేంద్రం నిర్వాహకురాలు జెసింతా, కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### మన్మధరావుపేట రైతులకు యూరియా కార్డులు

విడవలూరు మండలంలోని మన్మధరావుపేట రైతులకు ఈనెల 11న యూరియా కార్డులు అందజేశారు. వ్యవసాయాధికారి లక్ష్మి మాట్లాడుతూ, అన్నిరైతు సేవాకేంద్రాల్లో యూరియా కార్డులు ఇస్తున్నామన్నారు. ప్రతి రైతుకి ఎకరాకి 3 బస్తాల వంతున యూరియా అందజేస్తున్నామని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని చెప్పారు. వీఏఏ విష్ణుప్రియ పాల్గొన్నారు.

### పబ్బులేటిపల్లిలో అగ్నిప్రమాదం

సీతారామపురం మండలంలోని పబ్బులేటిపల్లిలో రోడ్డు పక్కన ఉన్న రెండు దుకాణాలకు అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ దుకాణాల వారు నష్టపోయారు. సుమారు 10 లక్షల దాకా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంటున్నారు. విఆర్ఓ మురళి అగ్నికి ఆహుతైన ఆ దుకాణాలను పరిశీలించారు.

### ఎర్రగుంటలో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం మండలంలోని ఎర్రగుంట గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి, తగు సూచనలిచ్చారు. ఎన్ఎస్ఎస్ శిబిరం సమన్వయకర్త డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డి, గ్రామ నాయకులు వేణు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### నరుకూరులో అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

తోటపల్లిగూడూరు మండలంలోని నరుకూరు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈనెల 11న ఇందుకూరుపేట సీడీపీఓ కె. లక్ష్మీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నపిల్లల ఎదుగుదలకు ఎప్పటికప్పుడు ఆరోగ్యపరీక్షలు చేస్తుండాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితాంబ పాల్గొన్నారు.

### దగదర్తిలో ప్రజలకు వైద్యసేవలు

దగదర్తి మండలానికి విశేష సేవలందించిన నాయకుడు తాళ్ళూరు రమణయ్యనాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 11న ఆయన కుటుంబసభ్యులు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి, ప్రజలకు వైద్యసేవలందించారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి, తగు సలహాలిచ్చారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

### కోవూరులో వీరాంజనేయస్వామికి పల్లకి సేవ

కోవూరులో వెలసివున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 11..కార్తీక మంగళవారం రోజున ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వైభవంగా పల్లకిసేవ నిర్వహించారు.

## గురువుకి.. పుట్టినరోజు శుభాకాంక్షలు



నవంబర్ 8వతేదీ తమ రాజకీయ గురువు లాల్‌కృష్ణ అద్వానీ 98వ పుట్టినరోజు సందర్భంగా, భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఢిల్లీలోని అద్వానీ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మధ్యలో వెంకయ్య వ్యక్తిగత కార్యదర్శులు సురేష్‌బాబు, చైతన్య ఉన్నారు.

## ఉప్పుటేరు బ్రిడ్జ్‌కి నిధులివ్వండి

--- ప్రశాంతమ్మ వినతి ---

ఇందుకూరుపేట మండలంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలను అనుసంధానించడంలో కీలక పాత్ర పోషించే గంగపట్నం-పల్లిపాళెం బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్‌ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఇటీవల నెల్లూరుకు వచ్చిన ఇన్‌ఛార్జి మంత్రిని ఆమె కలసి, ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆ బ్రిడ్జ్ నిర్మాణానికి 14 కోట్ల 60 లక్షల రూపాయలు అవసరమని, ఆ అంచనాలను ఆమె సమర్పించారు. 2021లో నివార్ తుఫాను కారణంగా కోవూరు నియోజకవర్గంలో విధ్వంసానికి గురైన పొర్లుకట్టలు, సాగునీటి కాలువలకి సంబంధించిన పనులు ఇంకా పెండింగ్‌లో వున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఇటీవల మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీమంజిల్ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉందని, కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం శ్మశాన వాటికలు, మసీదులలో మౌలిక వసతులు కల్పించాలని ఆమె వివరించారు.

## కొండ బిట్రగుంట ఆలయానికి..
# త్వరలోనే మహర్దశ!

### 5.38 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి ఆనం



నెల్లూరుజిల్లా బోగోలు మండలం కొండ బిట్రగుంటలో వెలసివున్న ప్రాచీన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయానికి త్వరలోనే మహర్దశ రానుంది. బిలకూటక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఆ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల ఆయన కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డితో కలసి, కొండ బిట్రగుంటలో 5.38 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు కూడా. దేవాదాయ శాఖ, దాతల నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. అందులో, రూ 2 కోట్లతో నిర్మించనున్న ధ్యానమందిరం, మరో రూ. 2 కోట్లతో కళ్యాణ మండపం, రూ. 35 లక్షలతో కళ్యాణ కట్ట, రూ. 23 లక్షలతో రథశాల, గరుత్మంతుని విగ్రహం ఏర్పాటు మొదలైన పనులకు వారు శ్రీకారం చుట్టారు. తొలుత వారు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా, కావలి నియోజకవర్గంలో 73 ఆలయాలకు ధూపదీప నైవేద్యం స్కీం ద్వారా ప్రతి నెల 10వేల రూపాయలను అర్చకుల ఖాతాకు జమ చేస్తున్నట్లు మంత్రి ఆనం ఈ సందర్భంగా చెప్పారు. త్వరలోనే అక్కడి ఆలయాల అభివృద్ధి పనులకు కూడా నిధులు మంజూరు చేస్తామని కూడా తెలిపారు.

# నాణ్యతపై రాజీ పడకండి!

### ప్రభుత్వ బడుల బాగుకు.. మంత్రి నారాయణ ఆదేశం



నెల్లూరు నగరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు బాగా చదువుకునేందుకు అనువైన ఆహ్లాదకర వాతావరణం ఉండేందుకు, వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర పురపాలకమంత్రి నారాయణ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇటీవల ఆయన నెల్లూరు నగర నియోజకవర్గం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆరా తీస్తూ, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. 8వ డివిజన్లోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఆర్ఎస్ఆర్ స్కూల్‌తో పాటు.. 14వ డివిజన్‌లోని మల్లెల సంజీవయ్య స్కూల్ ఆధునీకీకరణ పనులపై సమాచారం సేకరించారు. పనులు జరుగుతున్న చోటుకు వెళ్లి పరిశీలించారు. అత్యున్నత ప్రమాణాలతో పాఠశాలల ఆధునికీకరణ పనులు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ విఆర్ మున్సిపల్ హైస్కూల్ కంటే మెరుగ్గా మౌలిక వసతులు ఉండాలని చెప్పారు. తాను తరచుగా ఆకస్మిక తనిఖీలు చేస్తుంటానని.. పనులలో జాప్యం, నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ.. స్ఫూర్తిదాయకం!

### జాగృతి యాత్ర బృందం ప్రశంస



ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శ్రీసిటీ స్ఫూర్తిదాయకమని ఈనెల 12న శ్రీసిటీని సందర్శించిన 525 మంది సభ్యులు గల జాగృతి యాత్రా బృందం కొనియాడింది. పారిశ్రామికవేత్తలను తయారుచేసే లక్ష్యంతో ముంబైకి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా 8వేల కిలోమీటర్లు పర్యటించి, వివిధ రంగాలలో ఆదర్శవంతులను కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికులలో స్ఫూర్తి నింపుతుంది. ఆ బృందానికి శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతిని వివరించారు. తమ బృందానికి శ్రీసిటీ సందర్శన అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈఓ అశుతోష్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఉగ్రదాడులకు... జనసేన నిరసన




ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబ్ పేలుడు పట్ల నెల్లూరులో జనసేన నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను తరిమికొట్టాలంటూ నినాదాలు చేశారు. బాంబు పేలుడు ఉగ్రవాదుల పిరికిపంద చర్య అని, దేశ శాంతి భద్రతలకు జాతి సమైక్యతకు భంగం కలిగించాలని చూస్తే ఉగ్రవాదులకు నిరాశే మిగులుతుందని అన్నారు. ఈ కేసుల్లో వైద్యులు, విద్యావంతులు అరెస్టు కావడం చూస్తుంటే ఉగ్రవాదం ఎంత వికృతంగా ఉందో తేటతెల్లమవుతుందన్నారు. ఇలాంటి ఘటనలు దేశానికి ప్రమాదకరమని, ఉగ్రవాదులను ఏరిపారేయాలని అన్నారు. ప్రపంచంలో బలమైనదేశంగా భారత్ ఎదుగుతున్న సమయంలో ముష్కరుల వికృత చర్యలకు బలైనవారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబసభ్యులకు తమ సంతాపం తెలిపారు. జనసేన నాయకుడు గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో ఇటీవల కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతుల కుటుంబాలకు నివాళులర్పించారు. పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం

### • డీడీఆర్సీ సమావేశంలో మంత్రి ఫరూక్ హామీ



జిల్లాలో ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి, జిల్లా అభివృద్ధి సమీక్షా మండలిలో చర్చించిన అన్ని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ చెప్పారు. ఇటీవల నెల్లూరు జడ్పీ సమావేశమందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డిడిఆర్సి) సమావేశంలో ఆయన పాల్గొని ఆయా సమస్యలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించారు. జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షత వహించగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, జలవనరులు, గృహనిర్మాణం, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రోడ్డు ప్రమాదాల నివారణ మొదలైన అంశాలపై మంత్రులు చర్చించారు. అనంతరం మంత్రి ఫరూక్ విలేకర్లతో మాట్లాడుతూ డిడిఆర్సి సమావేశంలో ప్రధానంగా వ్యవసాయ అనుబంధశాఖలు, జాతీయ రహదారులపై చర్చ జరిగిందన్నారు.

రాష్ట్రమంతా రబీ మొదలు కాగా, నెల్లూరుజిల్లాలో ఖరీఫ్ ఇప్పుడు మొదలవుతుందని, ఈ సీజన్లను మార్పు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎన్‌హెచ్ అధికారులతో భద్రతాచర్యలపై చర్చించామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడు తున్న చర్యలను ఈ సమావేశంలో తొలుత డీటీసీ చందర్ వివరించారు. నిబంధనలు పాటించని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తూ బస్సులను సీజ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 60 బస్సులను సీజ్ చేస్తే ఒక్క నెల్లూరుజిల్లాలో 30 బస్సులను సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక మంత్రి నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com